

హైదరాబాద్ వార్త


# జూబ్లీ గెలుపులో 'గేమ్ ఛేంజర్లు'

**- పనిచేసిన మంత్రుల మంత్రాంగం - కాంగ్రెస్ గెలుపులో వారిది ప్రత్యేక పాత్ర**



ఎల్లారెడ్డిగూడలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌గౌడ్(పాతచిత్రం)



రహమత్‌నగర్‌లో ర్యాలీలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి(పాతచిత్రం)

**జూబ్లీహిల్స్, నవంబరు 15, ప్రభాతవార్త:** రణరంగాన్ని తలపించిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు వెనుక డివిజన్ల వారీగా కేటాయించిన మంత్రుల మంత్రాంగం పనిచేసింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపుకు అలుపెరగని వారి కృషి జూబ్లీహిల్స్‌ను 'హస్త' గతం చేసుకొనేలా చేసింది.. పదహేరళ్ల సుదీర్ఘ విరామం తరువాత సరైన ప్రణాళికతో, పోల్ మెనేజ్‌మెంట్‌తో జూబ్లీ సీటును తమ ఖాతాలో వేసుకొనేలా చేశారు. అంతేకాదు.. తమకు కేటాయించిన డివిజన్లలో మెజార్టీ ఓట్లను రాబట్టడంలో విశేషమైన కృషి చేశారు. గులాభి కంచుకోటగా ఉన్న డివిజన్ ప్రాంతాల్లో సైతం కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రావడం వెనుక వారు 'గేమ్‌ఛేంజర్'లుగా నిలిచారు.

### డివిజన్ల వారీగా బాధ్యతలు

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి, అభ్యర్థిని నిర్ణయించిన రోజు నుంచే కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన విధానంతో ముందుకెళ్లింది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళ్‌రావునగర్, సోమాజీగూడ, షేక్‌పేట డివిజన్లకు మంత్రులను కేటాయించింది. పట్టణ ప్రాంతాల్లో పార్టీ ఉన్న బలాబలాలు-బలహీనతలు స్పష్టంగా తెలుసుకున్న నేతలు ప్రతి డివిజన్‌కు ప్రత్యేక ఆపరేషన్ ప్లాన్‌ను రూపొందించుకున్నారు. మైనార్టీ ఓటర్లు, మహిళా ఓటర్లలో అసంతృప్తి, యువతను ఆకట్టుకొనే అంశాలు, కులాలను, వర్గాలను కూడగట్టే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే బోరబండ డివిజన్‌కు సీతక్క, రహ్మత్‌నగర్ డివిజన్‌కు పొంగులేటి శ్రీనివాస్, ఎర్రగడ్డ డివిజన్‌కు దామోదర రాజనర్సింహా, వెంగళ్‌రావునగర్ డివిజన్‌కు తుమ్మల నాగేశ్వర్‌రావు, యూసుఫ్‌గూడ డివిజన్‌కు పొన్నం ప్రభాకర్, షేక్‌పేట డివిజన్‌కు వివేక్ వెంకటస్వామి, సోమాజీగూడ డివిజన్‌కు దుద్దిళ్ల శ్రీధర్‌బాబును నియమించారు. బోరబండలో ఉన్న మాస్ ఓటర్లను సీతక్క తనదైన శైలిలో ఆకట్టుకున్నారు. రహమత్‌నగర్ డివిజన్ ఇంఛార్జిగా ఉన్న మంత్రి పొంగులేటి అత్యధికంగా ఉన్న మైనార్టీ ఓటర్లను, ఇతర ఓటర్లను హస్తం వైపు తిప్పుకోవడంలో ఎక్కడా వెనుకాడలేదు. ఆయన రంగప్రవేశంతో నియోజకవర్గంలోని ఓటర్ల మనసు మారిపోయేలా చేసింది. ఇక వెంగళ్‌రావునగర్‌లో సామాజిక వర్గాన్ని దృష్టిలో పెట్టుకొని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఓటు లాభియింగ్ చేశారు. అదే సమయంలో సోమాజీగూడ డివిజన్‌లో దుద్దిళ్ల శ్రీధర్‌బాబుది ఎంతో ప్రత్యేకం. ఒకవైపు రాష్ట్రానికి తలమానికమైన పెట్టుబడుల సంస్థలను ఆహ్వానించడం, సమావేశాల్లో పాల్గొనడం చేస్తూనే మరోవైపు సోమాజీగూడ డివిజన్‌లో ఓటర్లను కాంగ్రెస్ వైపు తిప్పడంలో ఆయన సఫలీకృతులయ్యారు. అపార్ట్‌మెంట్ వారీగా, కాలనీల వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి అందరిని ఆలోచింపజేశారు. షేక్‌పేటలో 50 శాతం ఓట్లు కాంగ్రెస్‌కు పడటమే కాకుండా స్వల్ప మెజార్టీని తీసుకురావడంలో మంత్రి వివేక్ వెంకటస్వామి విజయం సాధించారు. దాదాపుగా బీఆర్‌ఎస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్న ఈ ప్రాంతంలో వివేక్ వెంకటస్వామి చేసిన ప్రయత్నం ఫలించింది.

### క్షేత్రస్థాయిలో..

డివిజన్ ఇంచార్జిలుగా వచ్చిన మంత్రులు ఆయా డివిజన్‌లోని నాయకులను కలుపుకొని ముందు కెళ్లడమే కాకుండా డివిజన్లలో ప్రభావవంతమైన ఇతర పార్టీల నేతల గురించి ఆరా తీశారు. వారి వివరాలు సేకరించి వారితో అంతర్గతంగా చర్చలు జరిపారు. దీనికితోడు ప్రతిరోజు ఇంటిఇంటికి, గల్లీగల్లీకి వెళ్లి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల ముందు దాదాపు రూ. 200 కోట్ల పనులను ప్రారంభించడంతోపాటు మంత్రులు కాలనీల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించి ప్రజల్లో నమ్మకం కల్పించారు. వారితో మమేకమై వారికి అనునిత్యం అందుబాటులో ఉన్నారు.

### పోలింగ్ రోజు మిషన్ మోడ్..

పోలింగ్ రోజున ప్రతి డివిజన్‌లో మంత్రులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. హై ఓల్టేజ్ ఉన్న బూత్‌లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ప్రతి గంటకు నివేదికలు తెప్పించుకొని అందుకు అనుగుణంగా ముందుకు సాగారు. పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఉండి పర్యవేక్షించారు. ఓటర్లను ఇంటి నుంచి ఓటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడంలో ఒక అడుగు ముందుకేశారు. ఓటరును ప్రసన్నం చేసుకోవడానికి అవసరమైన అన్ని అస్త్రశస్త్రాలను వినియోగించారు. మొత్తంపై జూబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులంతా కలిసి విజయాన్ని తమ ఖాతాలో వేసుకోవడంలో ప్రత్యేక పాత్ర పోషించారు.

# హైడ్రా అంటే అభయం..భయం వద్దు

**-ప్రజలను భయాందోళలనకు గురి చేస్తే కఠిన చర్యలు**
**-కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక**



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, నవంబర్ 15, ప్రభాతవార్త:** హైడ్రా అంటే అభయమని, హైడ్రా పేరుతో అపోహలు సృష్టించడం, ప్రజలను భయాందోళలనకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ కుంట (సుద్దకుంట చెరువు) చెంత ద్వారకానగర్ నివాసితుల ఫిర్యాదుల మేరకు కమిషనర్ శనివారం క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. సుమారు గంటపాటు అక్కడ పర్యటించి స్థానికులతో మాట్లాడి ప్రతి అంశాన్ని నివృత్తి చేశారు. అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా చెరువుల పేరిట ఆందోళనలు కలిగించే వివిధ శాఖల అధికారులకు గట్టి ఆదేశాలు జారీ చేశారు. చెరువుల కబ్జాదారులపై చర్యలకు ఎట్టి పరిస్థితుల్లో వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. హైడ్రా పేరు చెప్పి వసూళ్లు చేస్తున్న ఘటనలు కూడా తమ దృష్టికి వస్తున్నాయని, అలాంటి విషయాలను సహించేది లేదన్నారు. సుద్దకుంట చెరువు చెంత తాము 30 ఏళ్ల క్రితం నుంచి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని.. ఇప్పుడు మా నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్నాయని హైడ్రా పేరు చెప్పి బెదిరిస్తున్నారని ఆరోపించారు. హెచ్‌ఎండిఏ, మున్సిపల్ స్థానిక అధికారులు ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేసి ఇనుప కడ్డీలు పాతి.. ఇళ్లపై నంబర్లు వేసి ఈ ఏడాది జులైలో మార్కింగ్ చేశారు. ఇదేమని అడిగితే హెచ్ ఎండీఏ, మున్సిపల్ అధికారులు మరింత భయాందోళనలు కలిగిస్తున్నారు. ఈ చెరువుకు 2014లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లు పాతారు. వాటిని పట్టించుకోకుండా అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎఫ్‌టీఎల్ హద్దులు మార్చివేశారు. నివాసాలలో చెరువు ఎఫ్‌టీఎల్ ఉన్నట్లుగా చూపించి ప్రజలను భయపెడుతున్నారు. దీనివల్ల నెలల తరబడిగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. ఎంతమంది అధికారులను కలిసినా సరైన సమాధానం రాలేదు.. దీంతో హైడ్రాకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నాము అని హైడ్రా కమిషనర్ ముందు పలువురు స్థానికులు వాపోయారు. 1990లో ఈ చెరువుకు నివాసాలకు మధ్య రోడ్డు వేసిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. అయినప్పటికీ రోడ్డును కూడా ఎఫ్‌టీఎల్‌లో చూపించి ప్రజలలో భయం కలిగించారని అధికారులపై ఫిర్యాదు చేశారు.

### సుద్ధకుంటను పరిశీలించిన హైడ్రా కమిషనర్

స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ శనివారం సుద్ధకుంటను సందర్శించి ఇళ్లపై వేసిన మార్కింగ్ లను పరిశీలించారు. అక్రమంగా ఇళ్లపై మార్కింగ్ వేసి భయభ్రాంతులకు గురి చేసిన హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. చెరువు చెంత ఉన్న నివాసాల వారికి ఎలాంటి చింత అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ చెరువుకు 2014లోనే 3.16 ఎకరాల మేర చెరువుందని హెచ్‌ఎండీఏ వాళ్లు ప్రిలిమనరీ నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. దాని ప్రకారమే చెరువు హద్దులు నిర్ణయించి కాపాడతామని హామీ ఇచ్చారు. చెరువు హద్దులు మార్చివేసి వేరొక వైపు చెరువు ఉన్నటుగా చూపించి ఇళ్లపై మార్కింగ్ వేసిన అధికారులపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తాయంటూ దాదాపు 48 ఇళ్లపై స్థానిక అధికారులు మార్కింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. 30 ఏళ్ల నుంచి నివాసాలు ఉంటున్న వారి జోలికి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఇళ్లపై వేసిన మార్కింగులు వెంటనే తొలగించాలని హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులు ప్రతిపాదించిన ఫైనల్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు పక్కన పెట్టి, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారమే ముందుకు వెళతామని రంగనాథ్ స్పష్టం చేశారు. నివాసాల జోలికి హైడ్రా వెళ్లదని 2024 జులై 19వ తేదీన హైడ్రాను ప్రభుత్వం తీసుకు వచ్చిందని.. ఈ తేదీకి ముందు నిర్మించి.. నివాసం ఉంటున్న ఇళ్ల జోలికి వెళ్లమని ప్రభుత్వ విధానం కూడా అదే అని పేర్కొన్నారు.

# బిజెపికి ఝులక్ ఇచ్చిన 'జూబ్లీ' ఓటర్లు.!

**-పార్టీకి చిత్తశుద్ధితో పనిచేయలేదన్న విమర్శలు**
**-ఒక్క ఉపఎన్నికే కదా అని పట్టించుకోని నేతలు?**
**-మూడోస్థానానికి పరిమితం కావడంపై హైకమాండ్ గుస్సా..!**

**హైదరాబాద్, నవంబరు 15 ప్రభాతవార్త** జూబ్లీహిల్స్‌లో కమలం ఎందుకు వాడిపోయింది? కనీసం డిపాజిట్ కూడా దక్కక పోవడానికి కారణాలేంటి? లోపం ఎక్కడ జరిగింది? కార్యకర్తల కష్టానికి కనీస విలువ కూడా లేకుండా చేసింది ఎవరు? వచ్చే జిహెచ్‌ఎంసి, అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావాలని కలలుగంటున్న ఆపార్టీ ఈ ఫలితాన్ని ఎలా చూస్తోంది? జూబ్లీహిల్స్ బైపోల్లో బీజేపీకి జూబ్లి ప్రజలు భారీ ఝులక్ ఇచ్చారు. కనీసం డిపాజిట్ దక్కకుండా పోయింది. అంతెందుకు 2023లో వచ్చిన ఓటు శాతాన్ని కూడా తిరిగి సాధించుకోలేకపోయింది కాషాయ దళం. దీంతో అసలు మనం ఎక్కడున్నాం ఏం చేస్తున్నామన్న చర్చ మొదలైందట పార్టీ వర్గాల్లో. తెలంగాణలో కాంగ్రెస్ ప్రత్యామ్నాయం మేమేనంటూ గొప్పలు చెప్పుకుని గప్పాలు కొట్టడం తప్ప వాస్తవంగా క్షేత్ర స్థాయిలో ఏం చేస్తున్నాం, ఈ ఉప ఎన్నిక నిజంగా గుణపాఠమేనని మాట్లాడుకుంటున్నాయట పార్టీ వర్గాలు. ఏవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడేసి గాల్లో మేడలు కడితే సరిపోదని, గ్రౌండ్‌రియాలిటీ తెలిసుండాలంటూ పార్టీలోనే నాయకత్వానికి చురకలంటించే వాళ్ళు పెరుగుతున్నారు. నేతల మధ్యసమన్వయం లేక పోవడం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వ్యవహరించడం వల్లే ఫలితం ఇంత దారుణంగా వచ్చిందని చెప్పుకుంటున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కేడర్ మీద తీవ్ర ప్రభావం చూపిస్తుందన్న అభిప్రాయం సైతం వ్యక్తం అవుతోంది. పార్టీలో చాలామంది ముఖ్య నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించారట. మరీముఖ్యంగా చెప్పాలంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గపరిధిలోనికే ఈ జూబ్లి హిల్స్ నియోజకవర్గం కావడం గమనార్హం. ఒకప్పుడు గ్రేటర్‌లో మెజార్టీ డివిజన్లలో జెండా ఎగురవేసిన పార్టీ ఇపుడు ఒక్క నియోజకవర్గంలోనే ఇలా ఎందుకు బోల్తాపడిందన్న ప్రశ్నలు చుట్టుముడుతున్నాయి. అతిరథ మహారథులందరూ గ్రేటర్‌లోనే ఉంటారు. కిషన్‌రెడ్డితోపాటే మరో కేంద్ర మంత్రి, ఎంపిలు, ఎమ్మెల్యేలు, పార్టీ కీలకనేతలు కూడా ప్రచారం చేసారు. ఇక రాష్ట్ర అధ్యక్షుడు తన బాధ్యత తనకు ఎలాగూ తప్పదన్నట్లుగా ప్రచారం నిర్వహించినట్లు విమర్శలున్నాయి. మొత్తంగాచూస్తే అభ్యర్థి కూడా ఎన్నికల నిర్వహణలో కొంత వెనుకంజలోనే ఉండటంతో కేడర్ కూడా ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు ముందుకు పోయారు. ఇదే అదునుగా ప్రత్యర్థి పార్టీలు వీరందరికి గేలం వేసినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మొత్తంగాచూస్తే హైకమాండ్ ఆహా ఏముందిలే ఒక్క నియోజకవర్గమే కదా అన్నట్లు కాకుండా పరిస్థితిని ఇప్పటినుంచే సీరియస్‌గా తీసుకుంటున్నట్లు కూడా రాష్ట్ర వర్గాలకు సంకేతాలు అందుతున్నాయి. ఎన్నికలో ఎవరెవరు చిత్తశుద్ధితో పనిచేయలేదో పార్టీకి అంకితభావంతో పనిచేయలేదో వారందరిపైనా నిఘా ఉంచినట్లు సమాచారం. పైగా అక్కడ ఏం జరిగినా అది కొందరి ఖాతాలోకే వెళ్తుందని, ఆ మాత్రందానికి మనం చించుకోవడం ఎందుకన్న భావన ఓ వర్గంలో నెలకొందని, సమష్టి తత్వం లేని అలాంటి ఆలోచనల ఫలితమే ఇదన్న చర్చ జరుగుతోంది. లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో తెగ సంబరపడిపోతున్న వాళ్ళకు ఈ ఉప ఎన్నిక ఫలితం కనువిప్పు కావాలని పార్టీ శ్రేణులే మాట్లాడుకుంటున్న పరిస్థితి. దీనికి ఎవరి పైనో నెపం నెట్టేసి తప్పుకోవాలని అనుకోవడం కరెక్ట్ కాదని, లోపం ఎక్కడుందో కనుక్కొని సరిచేసుకుంటేనే రేపు వచ్చే జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో ప్రభావం చూప గలుగుతామని అంటున్నారు. వ్యక్తుల మీద కోపం పెట్టుకుని పని చేస్తే అది అంతిమంగా ఆ వ్యక్తులకంటే పార్టీ మీద ఎక్కువ ప్రభావం చూపుతుందన్న సోయి లేకుండా మా నాయకులు పని చేశారని మాట్లాడుకుంటున్నారు కమలం కార్యకర్తలు. పార్టీ కన్నా తమ ఇగోలే ముఖ్యమని అనుకుంటే ఆ ప్రభావం ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి పని చేస్తున్న కార్యకర్తలపై పడుతుందని, నేషన్ ఫస్ట్, పార్టీ సెల్ఫ్ లాస్ట్ అనేది నినాదానికి పరిమితం కాకుండా చేతల్లో చూపించాలనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది బీజేపీలో. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లు కూడా ఈసారి రాక పోవడానికి కారణం మా నేతల వ్యవహార శైలేనన్నది కేడర్ వాయిస్. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ గెలిస్తే సంబరాలు చేసుకుంటున్న మా నాయకులు ఇక్కడ గెలవాలన్న సంగతి మర్చిపోతున్నారంటూ కాస్త సెటైరికల్గానే కామెంట్ చేస్తున్నారు బీజేపీ కార్యకర్తలు. జూబ్లీహిల్స్ ఫలితంతోనైనా కనువిప్పు కలగకుంటే వచ్చే బల్దియా ఎన్నికల నాటికి ఇంతే సంగతులు చిత్తగించవలెను అనడం తప్ప మరో మార్గం ఉండబోదని బీజేపీ లోనే అంతర్గతంగా చర్చ మొదలైంది.

# కారు పల్టీ... వైద్యురాలికి గాయాలు



బోల్తా పడిన కారు.

**ఫిలింనగర్, నవంబరు 15, ప్రభాతవార్త:** అతివేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి శుక్రవారం అర్ధ రాత్రి దాటిన తరువాత పల్టీలు కొట్టి అందులోని వైద్యురాలు గాయపడిన సంఘటన ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిలింనగర్‌లోని ఎన్టీవీ కార్యాలయం-భక్తి కార్యాలయానికి మధ్యలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత 3.15 గంటల ప్రాంతంలో వేగంగా వచ్చిన ఒక కారు అదుపుతప్పి విద్యుత్‌స్థంబాన్ని ఢీకొట్టింది. దీంతో కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. కారులో ఒక మహిళ ఉన్నట్లు స్థానికంగా ఉన్న కొందరు కార్యాలయాల సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. వెంటనే బోల్తా పడిన కారు పక్క అద్దాలను ధ్వంసం చేసి కారులో ఉన్న యువతిని రక్షించారు. కాగా కారు నడపుతున్న యువతికి స్వల్పంగా గాయలయ్యాయి. అదే సమయంలో కొందరు 100కు సమాచారం అందించారు. కాగా కారు నడుపుతున్నది వైద్య విద్యార్థిని అని, ప్రస్తుతం జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్న ముస్కాన్ సేటి(24)గా గుర్తించారు. శుక్రవారం రాత్రి స్నేహితులతో కలిసి ఒక విందు కార్యక్రమంలో పాల్గొని ఇంటికి తిరిగి వెళ్తుండగా ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కారును స్వాధీనం చేసుకున్నారు. కాగా వైద్యురాలు మద్యం సేవించి అదుపుతప్పిన వేగంతో ఈ సంఘటనకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దిశగా విచారిస్తున్నారు.

## బెట్టింగ్ యాప్‌లు.. బెటాలియన్ కానిస్టేబుల్ అదృశ్యం

**జూబ్లీహిల్స్, నవంబరు 15, ప్రభాతవార్త:** యూసుఫ్‌గూడలోని మొదటి పటాలంలో పనిచేస్తున్న ఒక కానిస్టేబుల్ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడలోని మొదటి పటాలంలో 2018 బ్యాచ్‌కు చెందిన పి. రమేష్(32) కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 14న బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ. 3లక్షల రుణాన్ని తీసుకొనేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. అలా వెళ్లన ఆయన సాయంత్రం పొద్దుపోయినా తిరిగి రాలేదు. దీంతో అతని భార్య మల్లీశ్వరి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త గతంలో పలు యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడేవాడని, బ్యాంకు రుణంతో అదే పని చేసి ఉంటాడని అనుమానిస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు నెలల క్రితం బెట్టింగ్‌లు మానేసినట్లు తెలిపాడని అందులో వివరించారు. తన భర్త ఆచూకీని కనుగోనాలంటూ ఆమె పోలీసులను కోరారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

## బెట్టింగ్ కోసం షాకింగ్ మర్డర్..!

**- యువతి హత్య -ఇంజనీరింగ్ విద్యార్థి అరెస్ట్**
**-జగద్గిరిగుట్ట కేసు ఛేదించిన పోలీసులు**

**జగద్గిరిగుట్ట, నవంబర్ 15, ప్రభాతవార్త :** ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం వ్యసనాలతో అప్పులపాలై డబ్బు కోసం హత్యకు దిగిన ఇంజనీరింగ్ విద్యార్థి శివ మాధవ రెడ్డి (23)ని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. ఖమ్మం జిల్లాకు చెందిన దేవేందర్ రెడ్డి, నిహారిక (21) దంపతులు వెంకటేశ్వరనగర్‌లో నివాసముంటున్నారు. ఈ నెల 12న డ్యూటీ ముగించుకుని ఇంటికి చేరుకున్న భర్త దేవేందర్ రెడ్డి, బాత్రూమ్‌లో నిహారిక పడి ఉండటం గమనించాడు. వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో ఇది సహజ మరణం కాదని, నిహారికను హత్య చేశారని పోలీసులు గుర్తించారు. అదే రోజు ఇంట్లో ఒంటరిగా ఉన్న నిహారికను శివ మాధవ రెడ్డి లక్ష్యంగా చేసుకున్నాడని విచారణలో బయటపడింది. భర్త పనికి వెళ్లడం, పొరుగువారు ఇంట్లో లేకపోవడం నిర్ధారించుకుని నిందితుడు ఇంట్లోకి ప్రవేశించాడు. ఆమెపై దాడి చేసి గొంతు కోసి హత్య చేసిన అనంతరం, ఇది సహజ మరణం అన్నట్లు సీన్‌ను సృష్టించాడు. తరువాత బంగారు మంగళసూత్రం, బంగారు చెవిపోగులు, మూడు బంగారు ఉంగరాలు, రూ. 2,500 నగదు దొంగిలించి అక్కడి నుండి పరారయ్యాడు. నిందితుడి వద్ద నుండి ఒక ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్లు, దొంగిలించిన నాలుగు తులాల బంగారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన జగద్గిరిగుట్ట పోలీసులు, ఎస్ఓటీ, సీసీఎస్ బృందాలను డీసీపీ అభినందించారు.

## రేపటి నుంచి ప్రజావాణి పునరుద్దరణ

**హైదరాబాద్, నవంబర్ 15, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈనెల 17వ తేదీనుంచి యథావిధిగా కొనసాగనుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎన్నిక ముగిసినందున తిరిగి వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమంను జిహెచ్ఎంసి పునరుద్ధరిస్తుంది.

## అద్వితీయం అపూర్వం భారతీయ నాట్యకళ

**-రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. నరసింహారెడ్డి**



గురు పద్మాకళ్యాణ్ శిష్యుల నృత్యప్రదర్శనల్లో దృశ్యం

**రవీంద్రభారతి, నవంబరు 15 ప్రభాతవార్త :** భారతీయ శాస్త్రీయ, సంప్రదాయ నృత్యకళలు అద్వితీయం, అపూర్వమైనవని, ఈ నాట్యకళను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ 42 వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శనివారం రాత్రి నాట్యం కరిష్యామి శీర్షికన వివిధ అంశాలతో నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ ప్రదర్శనను మీర్‌పేట్ లయన్స్‌క్లబ్ డా. ఎస్.సత్యనారాయణ, ఎన్నారై సిరిపాల్‌రెడ్డి, సంస్థ వ్యవస్థాపకురాలు పద్మాకళ్యాణ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి ప్రారంభించి సంస్థను స్థాపించిన ప్రమఖ నాట్యగురువు పద్మాకళ్యాణ్ గత 42ఏళ్లుగా విలక్షణమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్న తీరు ప్రశంసనీయమని ఆమె కళాసేవను కొనియాడారు. అత్యుత్తమ కళాకారులు శిష్యులను తీర్చిదిద్ది భవిష్యత్తులో మరెన్నో మహత్తర కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## గ్రంథాలయాలు సరస్వతి నిలయాలు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ పలని కధిరవన్, నగర గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి, చిత్రంలో కార్యదర్శి పద్మజ తదితరులున్నారు

**చిక్కడపల్లి నవంబర్ 15 ప్రభాతవార్త :** గ్రంథాలయాలు సరస్వతి నిలయాలు అని, యువతీ యువకులు వినియోగించుకోవాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ పలని కధిరవన్, నగర గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి అన్నారు. శనివారం అశోక్ నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములో భాగముగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పొట్లూరి. పద్మజ, ప్రథమ శ్రేణి గ్రంథపాలకురాలు ఎల్. చంద్రకళ గారు, బి. ప్రతిభా రెడ్డి , హైద్రాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు అవినాష్ గారు, వెంకటేశ్వర రెడ్డి , బొల్లంమహేందర్, హరిబాబు శంకర్ జంగారెడ్డి, పిడి మహేష్ మహేష్ గౌడ్ , ఈశ్వర్, రాజేష్, శ్రీకాంత్ నగర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, వివిధ శాఖా గ్రంథాలయ ఉద్యోగులు,విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన తెలంగాణ రచయిత అందెశ్రీ రచించిన నిప్పుల వాగు పుస్తకాన్ని బుక్ ఎగ్జిబిషన్లో ప్రదర్శించారు. అందే శ్రీ రచనలు పాటతో తెలంగాణ ఉద్యమం సమయంలో ఎంతో తెలంగాణ ప్రజలను మేల్కొల్పిందని ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి కొని ఆడారు.

## నా పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా...వచ్చే మెసేజ్‌లను నమ్మొద్దు : సిపి సజ్జనార్



**హైదరాబాద్, నవంబరు 15 ప్రభాతవార్త:** తన పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. ఆపదలో ఉన్నానని, డబ్బులు పంపాలని మోసపూరిత మెసేజ్‌లు పంపిస్తున్నారని చెప్పారు. ఈ మెసేజ్ నిజమని నమ్మిన ఓ స్నేహితుడు రూ.20 వేలు పంపి మోసపోయారని తెలిపారు. డబ్బులు పంపాలని వచ్చే మెసేజ్‌లను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద లింక్‌లు, మెసేజ్‌లు, వీడియో కాల్స్ వస్తే బ్లాక్ చేయాలని సూచించారు. ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నాని ఎక్స్ వేదికగా సూచించారు. 'నా పేరుతో ఫేక్ ఫేస్‌బుక్ ఖాతాలు సృష్టించి, నా స్నేహితులకు నేను ఆపదలో ఉన్నాను. డబ్బులు పంపించండి' అని సైబర్ నేరగాళ్లు సందేశాలు పంపిస్తున్నారు. దురదృష్టవశాత్తు, నిజమే అనుకుని నా స్నేహితుడు ఒకరు రూ.20,000ను మోసగాళ్ల ఖాతాకు పంపారు. నా వ్యక్తిగత ఫేస్ బుక్ పేజీ లింక్, మినహా నా పేరుతో ఉన్న మిగతా ఖాతాలన్నీనకిలివే. ఈ ఫేక్ ఖాతాలను మెటా సహకారంతో హైదరాబాద్ సైబర్ క్రైం టీం తొలగించే పనిలో ఉంది.

నా పేరుతో, లేదా ఏ అధికారి,ప్రముఖ వ్యక్తి పేరుతో ఫేస్ బుక్‌లో వచ్చే రిక్వెస్ట్‌లను స్పందించకండి. డబ్బులు పంపాలని వచ్చే సందేశాలను అసలు నమ్మకండి. ఒకవేళ అలా ఎవరైనా మెసేజ్‌లు చేస్తే.. ముందుగా ఫోన్ ద్వారా వ్యక్తిని స్వయంగా సంప్రదించి పరిశీలించండి. అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, వీడియో కాల్ లను వెంటనే బ్లాక్ చేసి రిపోర్ట్ చేయండి.

సైబర్ మోసాలను వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు రిపోర్ట్ చేయండి. మనమంతా జాగ్రత్తగా ఉంటేనే.. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా మనల్ని, మన డబ్బు ను కాపాడుకోగలం. అని సజ్జనార్ ట్వీట్ చేశారు.

## జర్నలిస్టులకు 'బండారు వైష్ణవ్ మెమోరియల్' అవార్డులు



అవార్డులు పొందిన సీనియర్ జర్నలిస్టులతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్, నవంబర్ 15, ప్రభాతవార్త:** జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా బండారు వైష్ణవ్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జర్నలిజం రంగంలో చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ బండారు వైష్ణవ్ మెమోరియల్ ఫౌండేషన్ తరఫున మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గారు సన్మానించారు. పత్రికారంగం లో నిజాయితీ, నిబద్ధత, విలువలు, వాస్తవాన్ని నిలబెట్టే జర్నలిస్టుల ఆత్మను గౌరవిస్తూ ఈ వేడుక నిర్వహించబడినట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రముఖ పాత్రికేయులు కె. రామచంద్ర మూర్తి, మల్లేపల్లి లక్ష్మయ్య, దాసు కేశవరావు, పి.ఎ. రామారావు, గుండు వల్లీశ్వర్, బండారు శ్రీనివాస, ఎస్. విజయ్ కుమార్ రెడ్డి (ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షులు), పాషం యాదగిరి, కప్పర ప్రసాద్, ఎఫ్.ఎం. సలీం తదితరులను సన్మానించారు.

## గురుకుల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం

### - రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



నార్సింగి గురుకుల పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, నవంబర్ 15 ప్రభాతవార్త :** నార్సింగి గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని సాంఘీక గురుకుల విద్యాలయంలో రూ.20.లక్షలతో నిర్మించిన ఆధునిక పింక్ టాయిలెట్స్, వాటర్ ట్యాంక్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల బిడ్డలే చదువుకుంటారని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యా, వైద్యంకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. విద్యార్థులు ఇష్టంగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురుకుల పాఠశాలల్లో కార్పోరేట్ స్థాయి విద్య అందించడం జరుగుతుందని, విద్యార్థుల అభిరుచుల మేరకు క్రీడలల్లో సైతం నిష్ణాతులతో శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. ఇష్టమైన రంగంలో కష్టపడితే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, మాజీ వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ ఉషారాణి, గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 16 నుండి డిగ్రీ, పీజీ తరగతులు ప్రారంభం

**జూబ్లీహిల్స్, నవంబరు 15, ప్రభాతవార్త:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ మొదటి, మూడవ, అయిదవ సెమిస్టర్ కౌన్సిలింగ్ తరగతులు, పీజీ ద్వితీయ సంవత్సరం తరగతులను నవంబరు 16 నుండి నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ విద్యార్థి సేవా విభాగ డైరెక్టర్ డాక్టర్ వై. వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులు వారి అధ్యయన కేంద్రాల్లో కౌన్సిలింగ్ తరగతులకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు మరిన్ని వివరాల కోసం అధ్యయన కేంద్రాల్లో లేదా విశ్వవిద్యాలయ పోర్టల్‌లో సంప్రదించాలని సూచించారు.

## ప్రజాస్వామ్య సమాజ అభివృద్ధికి తోడ్పడాలి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపల్ డాక్టర్ మట్టా శేఖర్

**చిక్కడపల్లి నవంబర్ 15 (ప్రభాతవార్త ) :** బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాశాల పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జంట నగరాల్లోని వివిధ జర్నలిజం కళాశాల విద్యార్థులకు పిఆర్, జర్నలిజంపై మాస్టర్ క్లాస్ కార్యక్రమాన్ని డిపార్ట్మెంట్ ఆఫ్ జర్నలిజం కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపల్ డాక్టర్ మట్టా శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై "మాస్ కమ్యూనికేషన్ జర్నలిజం" ప్రజాస్వామ్య సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. వివిధ కళాశాల నుండి విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పబ్లిక్ రిలేషన్స్ వాయిస్ ఎడిటర్ మాజీ చైర్మన్ బాబ్జి, పి ఆర్ ఎస్ ఐ మాజీ చైర్మన్ కృష్ణ బాజీ విద్యార్థులకు పిఆర్ ఎంప్లాయ్మెంట్ పై తమ ప్రసంగాలను విద్యార్థులకు పిపిటి ద్వారా అవగాహన కల్పించారు. సమన్వయ కర్తలుగా డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్, ఫాతిమా వ్యవహరించగా కార్యక్రమంలో డాక్టర్ ఖమ్మంపాటి యాదగిరి, రాజేష్ కళ్యాణ్ సెక్రటరీ పిఆర్ఎస్ఐ లు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు



కార్యక్రమంలో పాల్గొన్న శాతవాహన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ప్రొఫెసర్ ఎన్.కిషన్ తదితరులు

**చిక్కడపల్లి నవంబర్ 15 (ప్రభాతవార్త ) :** బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళా భవన్ లో చిక్కడపల్లి, ఉప్పల్ అరోరా పీజీ కళాశాలల స్నాతకోత్సవ కార్యక్రమం శనివారం సమరోహ 2025 పేరుతో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాతవాహన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్ హాజరై ప్రారంభించి ప్రసంగించారు. సభకు ఉస్మానియా విశ్వవిద్యాలయం అకాడమిక్ ఆడిట్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.కిషన్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో విశిష్ట అతిథి గా శాస్త్రవేత్త, జి ఎస్ ఎల్ డి ఆర్ డి ఓ డాక్టర్ సంజయ్ కుమార్ సాహూ, మేనేజింగ్ డైరెక్టర్ ఐడియా బైట్స్ శ్రీనివాస్ రెడ్డి కట్ట ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్‌శాస్త్రి, అరోరా గ్రూప్ చైర్మన్ నిమ్మటూరి అనుదీప్, డైరెక్టర్ ప్రదోష్ చంద్ర పట్నాయక్, డాక్టర్ ఆర్ సుష్మ, విభాగాధిపతులు బి సంతోష్ కు మార్, ఎం సుందరం, డాక్టర్ నజియా అఫ్రోజ్, ఆర్ అర్జున్ రా వు, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు టాప్ టెన్ ర్యాంకులు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎక్సలెన్స్ సర్టిఫికెట్స్ అందజేశారు.

## ప్రమాదాల నివారణకు పౌరులుగా ముందుండాలి



**కూకట్‌పల్లి, నవంబర్ 15, ప్రభాతవార్త** రోడ్డు ట్రాఫిక్ ప్రమాదం వల్ల ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన, ప్రభావితమైన వారిని గుర్తుంచుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రతి నవంబర్ మూడవ ఆదివారం నాడు వరల్డ్ డే ఆఫ్ రిమెంబర్స్ ఫర్ రోడ్డు ట్రాఫిక్ విక్టిమ్స్ జరుపుకుంటాము. ఇంటర్ కాంటినెంటల్ రోడ్ సేఫ్టీ ప్రోబ్ కాన్ఫిడరేషన్ సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ డే ఆఫ్ రిమెంబర్స్ ఫర్ రోడ్డు ట్రాఫిక్ విక్టిమ్స్ 2025 కార్యక్రమాన్ని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ 7వ ఫేస్ గీతాంజలి మోడల్ హై స్కూల్ సహకారంతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాంజలి మోడల్ హై స్కూల్, విద్యార్థులచే వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణ వద్ద క్యాండిల్లు వెలిగించి, రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలు శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండడం బాధాకరమని, రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతాయని అన్నారు. అలాగే ఈ మధ్యకాలంలో బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబానికి, ఇంటర్ కాంటినెంటల్ రోడ్ సేఫ్టీ ప్రోబ్ కాన్ఫిడరేషన్, సంస్థ సీఈవో సముద్రాల కిరణ్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సముద్రాల కిరణ్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి సంవత్సరము 1.35 మిలియన్ల మనుషులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతున్నారని అలాగే సగటున ప్రతిరోజు 3700 మంది ప్రపంచవ్యాప్తంగా ఏదో ఒక మూలన రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో భారత దేశము టాప్ టెన్‌లో ఉండటం చాలా బాధాకరమని ఆయన తెలిపారు. ప్రతి గంటకు 53 ప్రమాదాలు నాలుగు నిమిషాలకు ఒక మనిషి రోడ్డు ప్రమాదంలో చనిపోతున్నారని, ప్రతిరోజు 377 మంది రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఆందోళనకర పరిణామంగా అభిప్రాయపడ్డారు. గీతాంజలి పాఠశాల ప్రిన్సిపాల్ కొల్లూరి రవిబాబు మాట్లాడుతూ రహదారి భద్రతలో శాశ్వత మార్పును నడిపించే ఇంజన్ విద్యార్థులు, యువత మనస్సులు జ్ఞానంతో సాధికారత పొందినప్పుడు, వారు తమ ఇళ్లు, పాఠశాలలు పరిసరాల్లో సురక్షితమైన వీధులకు అంబాసిడర్‌లు అవుతారన్నారు. కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డ్ 7వ ఫేస్, నివసితుడు అనిల్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా, మనల్ని మనం మాత్రమే కాకుండా రహదారిని పంచుకునే ప్రతి వ్యక్తిని రక్షించుకుంటామని దాని ద్వారా మన రహదారులను, వీధులను అందరికీ సురక్షితంగా మార్చగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి మోడల్ హై స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, కాలనీవాసులు వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, మస్తాన్, నాలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

### - హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి



నవ్యనాటకసమితి సంగీత నృత్య పోటీల ప్రారంభించిన జస్టిస్ ఎ.లక్ష్మీనారాయణ, రమణాచారి, ఫణీంద్ర, విజయకుమార్, సుధామాల, వసుంధర తదితర కళాకారులు, నాట్యగురువులు

**నాంపల్లి, నవంబరు 15 ప్రభాతవార్త :** అనాదికాలంగా వస్తున్న భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉత్కృష్టమైనవని, వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ అన్నారు. మన సంస్కృతిలో భాగాలైన సంగీతం, నృత్యం, లలితకళలన్నింటిపట్ల చిన్నతనం నుంచే పిల్లలకు అవగాహన అభిరుచిని పెంపొందించి అభ్యసింపజేయాలని ఆయన సూచించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీల సౌజన్యంతో నవ్య నాటకసమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన వైభవంగా నిర్వహిస్తున్న నవదిన స్వర్ణోత్సవాల్లో భాగంగా 50వ అఖిల భారత సంగీత నృత్యపోటీలను ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ విశిష్ట అతిథులు జి. వసుంధర, సంస్థ అధ్యక్షుడు వి.విజయకుమార్, కార్యదర్శి ఆర్ఎస్.సుధారాణి, ఎన్.సుధామాల తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి లాంఛనంగా ప్రారంభించారు. స్వాగతోపన్యాసంలో వి.విజయకుమార్ అఖిల భారత సంగీత నృత్యపోటీల ప్రహసన ప్రస్థానాన్ని సవివరపరచగా డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో గత ఆరున్నర దశాబ్దాలకుపైగా సంస్థ జాతీయస్థాయిలో శాస్త్రీయ సంగీత నృత్యపోటీలను నిర్వహిస్తూ యువకళాకారులను ఇతోధికంగా ప్రోత్సహిస్తున్న నవ్యనాటకసమితి కళాసేవ అపూర్వ సాంస్కృతిక యజ్ఞమని కొనియాడారు. సమితి వ్యవస్థాపకులు వేమరాజు నరసింహారావు క్రమశిక్షణ, సమయపాలన, నిస్వార్థ సేవాగుణమున్న ఆదర్శప్రాయుడని, అందువల్లనే 67 సంవత్సరాలుగా సమితి వర్ధిల్లుతోందని అన్నారు. సమితి కార్యక్రమాలు నిత్యనూతనత్వంతో వైవిధ్యభరితంగా ఉంటున్నాయని జి.వసుంధర కితాబిచ్చారు. అనంతరం కూచిపూడి నృత్యం జూనియర్ విభాగంలో పోటీలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. నృత్యగురువులు నిష్ణల సుధామాల, డా. ఇందిరాహేమ, మధుమతి కులకర్ణిలు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

# బతుకమ్మకుంట బాగుందా..!

### -వాకర్లతో మాట్లాడిన హైడ్రా కమిషనర్
### -సంతృప్తి వ్యక్తం చేసిన వాకర్లు



వాకర్స్‌తో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, నవంబర్ 15, ప్రభాతవార్త:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం బతుకమ్మకుంటను సందర్శించారు. సాయంత్రం 6 గంటల సమయంలో బతుకమ్మ కుంట చుట్టూ వాకర్లతో కలసి నడిచారు. బతుకమ్మ కుంట అభివృద్ధి పట్ల వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది వాకింగ్ కు వస్తున్నారు. ఎలా ఉపయోగపడుతోంది.. ఈ పరిసర ప్రాంత ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ కుంట యిప్పుడు మాకందరికీ విహార కేంద్రం అయ్యిందని స్థానికులు కమిషనర్ కు చెప్పారు. బతుకమ్మ కుంట అందుబాటులో రావడంతో ఈ పరిసర ప్రాంతాల రూపురేఖలే మారిపోయాయని... వాకింగ్ చేసుకుంటూ ఆరోగ్యాలు కాపాడుకుంటున్నామని అన్నారు. ఒకప్పుడు దుర్గంధంతో వ్యాధులు భారిన పడేవాళ్ళమని యిప్పుడు ఆరోగ్యాలు కాపాడుకు తున్నామన్నారు. పిల్లలకు మంచి క్రీడా స్థలంగా మారిందని చెప్పారు. ఈ చెరువును సెప్టెంబర్ 28న ప్రారంభించామని... చెరువు చుట్టూ వేసిన మొక్కలు పెద్దవైతే మరింత ఆరోగ్యవంతంగా పరిసరాలు మారుతాయని కమిషనర్ చెప్పారు. చెరువును యింతే శుభ్రంగా కాపాడుకోడానికి హైడ్రాతో కలసి పని చేయాలని అక్కడి వాకర్లను కమిషనర్ కోరారు. ఈ సందర్భంగా కమిషనర్‌తో ఫోటోలు దిగి చాలా మంది పదిలపరచుకున్నారు. చిన్నారులు థాంక్ యూ సార్ అంటూ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## చిల్డ్రన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో డిఆర్ఎస్ స్కూల్ విద్యార్థులు



చిల్డ్రన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ను సాధించిన డిఆర్ఎస్ స్కూల్ విద్యార్థులు

**హైదరాబాద్ నవంబరు 15, ప్రభాతవార్త** బాలల దినోత్సవం సందర్భంగా విద్యా, కళలు మరియు అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయంగా, జాతీయంగా అత్యంత ప్రతిభ కనబరిచిన ఐదు మంది విద్యార్థులకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అనుబంధ సంస్థ అయిన చిల్డ్రన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కింది. ఈ మేరకు నాయిస్ మేకర్స్ ఈవెంట్స్ సంస్థ సహకారంతో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయనిర్ణేతలు డా.పావని, డా.సరయు దేవభక్తుని చిల్డ్రన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కిన విద్యార్థిని విద్యార్థులు డెహ్రాడూన్‌లోని ఆసియన్ ఓపెన్ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ ట్రోఫీ 2025లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరచిన మిష్కా అగర్వాల్‌కు 'ది గ్లైడింగ్ గ్లోరీ అవార్డు"ను, సిబిఎస్ఈ క్లస్టర్ గోల్డ్ మెడలిస్ట్‌గా అథ్లెటిక్స్‌లో అత్యుత్తమ విజయానికి మరియు జాతీయ టాప్ 5 అథ్లెట్లలో స్థానం సంపాదించినందుకు బర్ధవల్ శివ శంకర్‌కు ది స్ప్రింటింగ్ స్టార్ అవార్డును, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించి డిజైన్ ఛాంపియన్‌షిప్ (సౌత్ జోన్)లో మొదటి స్థానాన్ని పొందిన అదితి సోమ కు ది విజనరీ డిజైనర్ అవార్డును, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో భరతనాట్యంలో నైపుణ్యం ప్రదర్శించిన కీర్తన రెడ్డి మడమడకలకు కల్చరల్ హార్మనీ అవార్డును, అంతర్జాతీయ పాఠ్యాంశాల యొక్క పదవ తరగతి బోర్డు పరీక్షలలో అన్ని సబ్జెక్టులలో సాధించినందుకు ఆరుషి ముదిగొండకు ది అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డును, సర్టిఫికెట్‌లను గుండ్ల పోచంపల్లి, డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేసారు. ఈ సందర్భంగా డిఆర్ఎస్ ఐఎస్ ప్రిన్సిపాల్ ఐ.వేణుగోపాల్ విజేతలను అభినందించి మాట్లాడుతూ ఈ వేడుక విద్యార్థుల యొక్క ఆనందకరమైన సారాన్ని క్రీడా, సంగీతం, సృజనాత్మకతను పెంపొదిస్తుందని, విద్యార్థులలో దాగి ఉన్న సృజన శక్తి, పరిశోధనలు రేపటి భవిష్యత్తుకు పునాదులు వేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఎస్ ఐఎస్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్, రెసిడెన్షియల్ హెడ్ రాజేందర్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, అడ్మిన్ హెడ్ వినోద రంజన్ పాల్గొన్నారు.

## లక్కీషా విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాందాస్‌నాయక్

**సైఫాబాద్, నవంబరు 15 ప్రభాతవార్త:** దేశంలోని ప్రముఖ వ్యాపారుల్లో ఒకరు, ఢిల్లీ ప్రజలు బంజారా సమాజం కోసం తన ప్రాణాలను అర్పించిన లక్కీషా బంజారా విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసి భారత రత్న అవార్డును ప్రకటించాలని తెలంగాణ గోర్ సేన అధ్యక్షుడు రాందాస్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్కీషా చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, గోర్‌బోటి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని కోరారు. లక్కీషా 1675 నవంబరు 24, 25 తేదీలలో ఢిల్లీ నగరాన్ని వీడారని, ఆ రోజును పురస్కరించుకుని తండాల్లో, నగరాల్లో లక్కీషా బంజారా భోగ్ భండారో పూజా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన బంజారాలకు విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోతే దశలవారిగా ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రాజునాయక్, తిరుపతి నాయక్, హరిలాల్ నాయక్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు ' తెలంగాణ సౌర రైతుల సాధికార సమ్మేళనం '

### నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వాహణ
### తెలంగాణ పీఎం కుసుమ్ ఫార్మర్స్ అడ్వయిజర్ సంతోష్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంతోష్‌రావు, గంగారెడ్డి, రమేష్ తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ పీఎం కుసుమ్ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు, రేపు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో తెలంగాణ సౌర రైతుల సాధికార సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అడ్వయిజర్ సంతోష్ రావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఉపాధ్యక్షులు ఆదినారాయణ, గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి. రమేష్, కార్యవర్గ సభ్యుడు రాజకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంతోష్ రావు మాట్లాడుతూ 2019లో ప్రారంభించిన పీఎం కుసుమ్ పథకం ద్వారా అనేక మంది సౌర రైతులకు ఆర్థిక స్వావలంభన లబించిందన్నారు. ఈ పథకం వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములు కలిగిన రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే సోలార్ రేడియేషన్ ఎక్కువగా ఉన్నప్పుడు అధిక విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఒక రైతు కాని, ఫార్మర్ సొసైటీకి హాఫ్ మెగావాట్ నుంచి 2 మెగా వాట్ల వరకు ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని, ఒక మెగావాట్ ఉత్పత్తి చేయాలంటే సుమారు మూడున్నర నుంచి నాలుగు ఎకరాల భూమి అవసరం ఉంటుందన్నారు. 25 ఏండ్ల కాలపరిమితి కలిగి ఈ పథకంలో యూనిట్కు రూ.3.13 ధరను డిస్కమ్ నుంచి చెల్లిస్తుందని, నాబార్డు నుంచి రైతుకు వడ్డీ రాయితీ కూడా ఉంటుందని, బ్యాంకులో రుణ సౌకర్యం కూడా ఉంటుందన్నారు. ఒక మెగా వాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలంటే రూ.4కోట్ల వ్యయమవుతుందని, బ్యాంకర్లు సైతం రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయని, కేవలం 15 నుంచి 20 శాతం మాత్రమే చెల్లిస్తే మిగతా మొత్తం రుణం లబిస్తుందన్నారు. ప్రాజెక్టు కోసం వినియోగించే భూమిని మార్టిగేజ్ చేయాల్సి ఉంటుందన్నారు. రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో సత్ఫలితాలనిస్తోందన్నారు. ఈ పథకం ప్రకటించిన క్రమంలో తెలంగాణ నుంచి వేలాది మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో 883 మంది రైతులు అర్హత సాదించారన్నారు. వారికి డిస్కంతో ఒప్పందం కుదిరిందన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తిపై గత మూడు నాలుగు నెలల నుంచి రైతులకు తమ అసోసియేషన్ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 16, 17న జరిగే సమ్మేళనంలో సౌర విద్యుత్ ఉత్పత్తి పరికరాలను ప్రదర్శిస్తున్నామని, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తిదారులు వస్తున్నారని తెలిపారు. సోలార్ ప్లాంట్ పెట్టాలంటే భూమి సర్వే, లీగల్ డాక్యుమెంటేషన్, వాల్యూయేషన్, సాయిల్ సాంపిల్ తదితర ప్రక్రియలుంటాయని, వాటిపై టీఎస్‌రెడ్కో, డిస్కమ్ నిపుణులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిధులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు.

## నిత్య యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం : మల్లారెడ్డి



తెలంగాణ రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

**నార్సింగి, నవంబర్ 15 ప్రభాతవార్త :** నిత్య యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యంను పొందుతామని తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ జన్వాడలోని ఎస్ఎంపి యూనివర్సల్ స్కూల్‌లో అండర్-14, అండర్-18 విభాగాలలో "12.వ,ఇంటర్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2025" పోటీలు ఘనంగా జరిగాయి. ఈ పోటీలలో వివిధ జిల్లాల నుంచి 600.మంది విద్యార్థులు పాల్గొని అద్భుతమైన యోగా విన్యాసాలు చేశారు. శరీరంను స్ప్రింగ్‌లా తిప్పుతూ విద్యార్థులు వేసిన యోగా విన్యాసాలు ఆహుతులను అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ యోగా శరీరం-మనస్సు రెండింటిని చురుగ్గా మారుస్తుందని తెలిపారు. ఎదిగే వయసులో ఉన్న చిన్నారులు నిత్యం యోగాసనాలు వేస్తే శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు చురుగ్గా ఉంటారని, ఏది నేర్చుకున్నా ఒంటబడుతుందన్నారు. భారతదేశంలో యుగ యుగాల నుంచి యోగ విద్య సాధన జరుగుతుందని, ఐదారు శతాబ్దాల నుంచి మనదైన యోగ విద్యను మన నుంచి విదేశీ పాలకులు దూరం చేశారన్నారు. యోగా ప్రాధాన్యతను గుర్తించిన ప్రధాని నరేంద్రమోదీ యోగాకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకు వచ్చారన్నారు. ప్రతీ ఒక్కరూ యోగను తమ దిన చర్యలో భాగంగా మార్చుకోవాలని, ఆరోగ్యవంతులైన భావి భారత పౌరులుగా మారాలని మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఈ యోగా పోటీలలో కరీంనగర్ జిల్లా తెలంగాణ చాంఫియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఓవరాల్ ప్రదర్శనలో రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో, నిజామాబాద్ జిల్లా ద్వితీయ స్థానంలో, మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు తెలంగాణ ఒలంపిక్ ప్రతినిధులు, ఎస్‌ంపి యూనివర్సల్ స్కూల్ చైర్మన్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డిలు బహుమతులు అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, యోగా గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డా.బి.విజయభారతి పుస్తకాలు ఆవిష్కరణ



విజయ కవితలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేర్సి మార్గరేట్

**సైఫాబాద్, నవంబరు 15 ప్రభాతవార్త:** సుప్రసిద్ధ రచయిత్రి, తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ డా.బి.విజయలక్ష్మి 84వ జయంతి సందర్భంగా బొజ్జా తారకం ట్రస్ట్, డా.బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విజయభారతి పుస్తకావిష్కరణ సభ కార్యక్రమం జరిగింది. 'ఆత్మగౌరవ పోరాటాలు-ఒక పరిశీలన' అనే పుస్తకాన్ని ప్రముఖ చరిత్రకారులు డా.సంగిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించగా, విజయ కవితలు (కవితా సంపుటి) అనే పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి మేర్సి మార్గరేట్ ఆవిష్కరించారు. ఈ సభకు అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డా.కె.లింగయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయభారతి పురాణాలను దళిత బహుజన దృక్పథంతతో విశ్లేషించిన పరిశోధకురాలని, అంబేద్కర్, పూలే జీవిత చరిత్రలను రచించిన రచయిత్రి, ప్రత్యామ్నాయ చరిత్రకారిణి అని కొనియాడారు. ఆమె రచించిన ఆత్మగౌరవ పోరాటాలు-ఒక పరిశీలన, విజయ కవితలు అద్భుతంగా ఉన్నాయని, అందరూ చదవదగ్గ పుస్తకాలని చెప్పారు. ఈ పుస్తకాల ద్వారా మనిషి పరిణి చెందగలరని వారన్నారు. ఈ కార్యక్రమంలో డా.కోయ కోటేశ్వర్‌రావు, గీతారామస్వామి, దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వారు ఆమె చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు.

### పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేపై అదుపుతప్పిన కారు

**మెహిదీపట్నం, నవంబర్ 15, ప్రభాతవార్త :** పి వి ఎన్ ఆర్ ఎక్స్ ప్రెస్ హైవే పై ఓ కారు అదుపుతప్పిన సంఘటన గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ బైరి రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి నుండి అత్తాపూర్ వైపు వెళ్తున్న టీఎస్ 10 ఎఫ్ జి 7011 కారులో ముగ్గురు మహిళలు, ఒక డ్రైవర్ సందీప్ బ్లూ ప్రయాణిస్తున్నారు. పివిఎన్ఆర్ ఎక్స్ ప్రెస్ హైవే 25 వద్దకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలు కావడంతో స్థానికంగా ఉన్నటువంటి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

## స్కూటీని ఢీకొట్టిన లారీ

### మహిళ ఉద్యోగి అక్కడికక్కడే మృతి

**బాచుపల్లి, నవంబర్ 15, ప్రభాతవార్త :** స్కూటర్ పై వెళుతున్న మహిళ ఉద్యోగిని వెనుక వైపు నుండి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టడంతో స్కూటీ నడిపిస్తున్న మహిళ అక్కడికక్కడే చనిపోయింది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం నల్లగండ్లకు చెందిన చొప్పల్లి తేజస్విని (34) శనివారం ఉదయం నల్లగండ్ల నుండి రోజు మాదిరిగానే ఉదయం తన స్కూటీపై బాచుపల్లిలోని తాను పనిచేసే పరిశ్రమకు బయలుదేరింది. మియాపూర్ చౌరస్తా దాటి ఐడి ఏబొల్లారం చౌరస్తా వద్దకు రాగానే వెనుక నుండి బొల్లారం వెళ్లడానికి మూలమలుపు తిరుగుతున్న లారీ స్కూటీని ఎడమవైపు ఢీ కొట్టి ఐడిఏ బొల్లారం వైపు మళ్ళింది. దీంతో స్కూటీ పై నుండి కింద పడిపోయిన తేజస్వి పొట్టపై భాగం నుండి లారీ వెనకాల టైరు వెళ్లిపోయింది. దీంతో పొట్ట భాగం పూర్తిగా చితికిపోయి తీవ్ర రక్తస్రావం జరిగి తేజస్వి అక్కడికక్కడే చనిపోయింది. లారీ డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యంగా లారీ నడిపిన కారణంగానే తన భార్య చనిపోయిందని తేజస్వి భర్త ఉదయ్ కిషోర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సైబర్ నేరాలపై పాతబస్తీలో అవగాహన ర్యాలీ



కార్యక్రమంలో పాల్గొన్న ఫలక్‌నుమా ఏసిపి జావిద్, కాలాపత్తర్ సిఐ మహ్మద్ ఖలీల్ పాషా

**చార్మినార్, నవంబరు 15 ప్రభాతవార్త :** సైబర్ నేరాల పట్ల పాతబస్తీ ప్రజలలో అవగాహన కల్పించటానికి శనివారం కాలాపత్తర్ పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మోచీకాలనీలో జరిగిన సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఫలక్‌నుమా ఏసిపి జావిద్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ క్రైమ్ పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పలు బస్తీలలో పోలీసులు సైబర్ క్రైమ్‌పై అవేర్‌నెస్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఖలీల్ ఫాషా, ఎస్ఐ శ్రీనివాస్, మోచీ కాలనీ బస్తీ సంఘం ప్రతినిధి కుమార్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి : సిఐ భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కామాటిపుర ఇన్‌స్పెక్టర్ భాస్కర్

**చార్మినార్, నవంబరు 15 ప్రభాతవార్త :** విద్యార్థులు సైబర్ నేరాలు పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలని కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ అన్నారు. బహదూర్‌పుర చౌరస్తాలో ఉన్న ఏషియన్ గ్రామర్ స్కూల్, కళాశాలలో జరిగిన సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫోన్‌కు వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే ఎటువంటి లింక్ యాప్‌లను తెరవ కూడదని తెలిపారు. సైబర్ నేరాలకు గురైన సమయంలో 1930 నెంబరుకు సమాచారాన్ని ఇవ్వాలని ఆయన తెలియజేశారు. సైబర్ క్రైమ్ మోసాలు పట్ల విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కామాటిపుర ఎస్ఐ నాగరాజు, ఎస్ఐ స్వర్ణ, ఏషియన్ గ్రామర్ స్కూల్, కళాశాల కరస్పాండెంట్ తస్లిం, ప్రిన్సిపాల్ రేష్మా జమీర్, వైస్ ప్రిన్సిపాల్ ఉమానా బాన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వంద మంది బ్రాహ్మణులకు స్వయం పాకం పంపిణీ



బ్రాహ్మణులకు స్వయంపాకం దానం చేస్తున్న అరుణాచల శివసేవా సత్సంగ్ ప్రతినిధులు.

**నార్సింగి, నవంబర్ 15 ప్రభాతవార్త :** కార్తీక మాసంలో చేసిన దానాలకు అనంతమైన పుణ్యం లభిస్తుందని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం మణికొండలో అరుణాచల శివసేవా సత్సంగ్ ప్రతినిధులు 100.మంది బ్రాహ్మణులకు స్వయం పాకంను దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెళ్లిన రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దాన, ధర్మాలు చేయడం సనాతన ధర్మంలో భాగమన్నారు. ప్రకృతి సిద్ధంగా జీవించడం, పంచభూతాలను పూజించడం, ప్రాణులన్నింటిని సమభావంతో చూడడం, సర్వేజనః సుఖినో భవంతూ అనడం హైందవ ధర్మంలో ఉన్న గొప్ప లక్షణమన్నారు. పెద్దలంతా సనాతన ధర్మంను ఆచరిస్తూ, తమ బిడ్డలచేత ఆచిరింపచేయాలని రామకృష్ణారెడ్డి సూచించారు.

## సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు
### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్


రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, నవంబర్ 15, ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని దోమలగూడ, అరవింద్‌నగర్ కాలనీలో 14లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అరవింద్ కాలనీలో రోడ్డు అధ్వాన్నంగా మారటంతో పాటు, ఓ మ్యాన్‌హోల్ వద్ద పెద్ద గొయ్యి ఏర్పడటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల సమస్య పరిష్కరించేందుకు అరవింద్‌కాలనీ వినాయక దేవాలయం నుంచి నాలా వరకు నూతన రోడ్డు ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు పంపించి, రోడ్డు శాంక్షన్ చేయించి, నేడు పనులు ప్రారంభించటం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలు ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి ఆయా సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వల్లాల శ్యాంయాదవ్, ఎస్‌డి సాయికృష్ణ, నాయకులు ఆర్.రాంచందర్, రాజేష్, రాజశేఖర్‌గౌడ్, గద్దె వేణు, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీకాంత్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చాలి


బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న జంపనప్రతాప్

**కంటోన్మెంట్, నవంబర్ 15 ప్రభాతవార్త:** ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. గౌతమ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో ఈ క్రీడా మైదానంలో కబ్జాకు గురి కాగా దానిని కాపాడి తమ సొంత నిధులతో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ,ఖోఖో, బ్యాడ్మింటన్, రన్నింగ్ వంటి క్రీడల్లో పాల్గొన్న విజేతలకు జంపన చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సంతోష్,ప్రిన్సిపాల్ అనుపమ, ఇన్‌ఛార్జి రవిందర్, రహమాత్, విశాలక్ష్మి,పింకి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : ముకుల్


కార్ఖాన గన్‌రాక్ ఎన్‌క్లేవ్ హై స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకల్లో ఎస్.జి.ఎఫ్. అధినేత ముకుల్

**కంటోన్మెంట్, నవంబర్ 15 ప్రభాతవార్త:** బాలలదినోత్సవాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ 3వ వార్డు కార్ఖానలోని గన్‌రాక్ ఎన్‌క్లేవ్ హై స్కూల్‌లో శనివారం నిర్వహించిన వేడుకలకు శ్రీగణేష్ ఫౌండేషన్ నిర్వాహకులు ముకుల్ ముఖ్య అతిథిగాహాజరై చిన్నారులకు ఆట వస్తువులు, బొమ్మలు అందజేశారు. ఈ సందర్భంగా ముకుల్ మాట్లాడుతూ విద్యార్థులు గురువుల ద్వారా మంచి విద్యా బుద్ధులు నేర్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అకాంక్షించారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులు పూర్తి చేయాలి : టీఎన్


2వ వార్డు క్రిష్ణా నగర్‌లో నిరుపయోగకరంగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేత టీ.ఎన్.శ్రీనివాస్

**కంటోన్మెంట్, నవంబర్ 15 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 2వ వార్డు రసూల్ పుర క్రిష్ణా నగర్‌లోని కట్ట మైసమ్మ సమీపంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.64 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను పూర్తి చేసి స్థానిక ప్రజలకు అంకితం చేయాలని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం అర్ధాంతరంగా నిలిచి పోయిన కమ్యూనిటీ హాల్‌ను కంటోన్మెంట్ బిఆర్ఎస్ నాయకుల ప్రతినిధి బృందంతో సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా టీ.ఎన్. మాట్లాడుతూ నిధుల కొరతతో అర్ధాంతరంగా నిలిచిపోయిన కమ్యూ నిటీ హాల్ నిర్మాణం పనులను పూర్తి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో బిఆర్ఎస్ నాయకులు కుమార్ ముదిరాజ్,దేవుపల్లి శ్రీను,శ్యామ్‌రెడ్డి, కుమార్ గౌడ్,పోచమ్మ, ఎల్లమ్మ,శారధ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ గర్వం, స్వాతంత్ర్య స్ఫూర్తికి బిర్సా ముండా ప్రతీక



**నిజాంపేట్, నవంబర్ 15, ప్రభాతవార్త**

భారతదేశ స్వాతంత్ర్య సమరంలో తన ధైర్యసాహసాలతో, ఆదివాసీ సమాజ హక్కుల కోసం చేసిన పోరాటంతో ప్రత్యేక స్థానం పొందిన మహానాయకుడు బిర్సా ముండా. ఆదివాసీ గర్వం స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక అని ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. బిర్స ముండా జయంతిని పురస్కరించుకొని నిజాంపేట్‌లోని వారి కార్యాలయంలో బిర్స ముండా చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 15న బిర్స ముండా జయంతిని దేశవ్యాప్తంగా ఘనంగా ఆచరిస్తారని అన్నారు. ఆదివాసీ సముదాయ హక్కులు, సంస్కృతి, స్వాభిమానాన్ని రక్షించడానికి ప్రాణాలు అర్పించిన వీరుడు బిర్సా ముండా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కిరణ్, కమలాకర్, సుహర్షిణి, సాయి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


అవగాహనా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అడిషనల్ డీసీపీ బి.ఆనంద్

**ముషీరాబాద్, నవంబర్ 15, ప్రభాతవార్త:** సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్‌జోన్ డీసీపీ కే.శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ బి.ఆనంద్ సూచించారు. శనివారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెయింట్ పీయుస్ జూనియర్ కళాశాలలో, గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో, దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏవీ కళాశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలో ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా సురక్షితంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏదైనా మోసం జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేసి, ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్‌లలో వచ్చే ఓటీపీ మెసేజెస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, లింకులు ఏవీ ఓపెన్ చేయకూడదని, ఏదైనా అనుమానం వస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. యువత మాదక ద్రవ్యాల వినియోగం విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని, మాదక ద్రవ్యాల జోలికి వెళ్తే యువత వారి భవిష్యత్తును కోల్పోతారని హెచ్చరించారు. ఎవరైనా యువతను మాదక ద్రవ్యాల వైపు ప్రేరేపిస్తే అప్రమత్తమై, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ అవగాహనా కార్యక్రమాలలో దోమలగూడ సీఐ అంజద్ అలీ, ముషీరాబాద్ ఎస్‌హెచ్ఓ జి.రమేష్‌బాబు, ముషీరాబాద్ డీసీ నదీమ్, గాంధీనగర్ డీఐవెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ ఖ్యాతి పొందిన వ్యక్తి చాచా నెహ్రు : సముద్రాల వేణుగోపాలచారి


ప్రసంగిస్తున్న మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి

**చిక్కడపల్లి నవంబర్ 15 ప్రభాతవార్త :** అలీనోద్యమ నిర్మాతగా ప్రపంచ ఖ్యాతి పొందిన వ్యక్తి మాజీ ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రుకు దక్కుతుందని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాదీక్షితులు కళావేదిక లో వి.కె.ఎస్.శరణ్య వెల్ఫేర్ సొసైటి , పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవం " చాచా నెహ్రూ చెకుముకి అవార్డు ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వాలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సేవారత్న డాక్టర్ మునగా రామ్మోహన్ రావు మాట్లాడారు. అనంతరం అవార్డు గ్రహీతలు పాయల్ శర్మ, సిద్ధిగొండ ఆర్తి, నీతు కుమారి చౌదరి, వైభవ్ శర్మ, కలాల్ వచనశ్రీ, ఎన్.దాశేశ్వర్, ఎమ్.మునేష్, టి.అశ్రీత్ లను ఘనంగా చాచా నెహ్రూ అవార్డుతో సత్కరించారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే అంశంపై జరిగిన కవిసమ్మేళనంలో కవులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వి.కె.ఎస్.శరణ్య వెల్ఫేర్ సొసైటి సభ్యులు మహ్మద్, కవయిత్రి డాక్టర్ రాధ కుసుమ, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు, సభ్యులు బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి
### : మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్


ఇండోర్ క్రికెట్ ప్రాక్టీస్ నెట్ కోర్టను ప్రారంభిస్తున్న ధనరాజ్ యాదవ్

**నిజాంపేట్, నవంబర్ 15, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ గ్రీన్ ఫీల్డ్స్ కాలనీలో పిల్లలు, యువకులు ఖాళీ సమయాల్లో ఆటలు ఆడుకునేందుకై నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ క్రికెట్ ప్రాక్టీస్ నెట్ కోర్ట్‌ను నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ పాల్గొని కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఫీల్డ్స్ కాలనీ ప్రెసిడెంట్ ఎంఎస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రావు, కమిటీ సభ్యులు ఫణి రాజు, సురేష్ రెడ్డి, కాలనీ వాసులు, పిల్లలు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయిస్తాం
### : మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి


విద్యార్థులకు కిట్స్ ను అందజేస్తున్న సురేష్‌రెడ్డి

**జీడిమెట్ల, నవంబర్ 15, ప్రభాతవార్త**

మహవీర్ ఇంటర్నేషనల్ చారిటబుల్ ఆర్గనైజేషన్ ద్వారా సిడికె గ్లోబల్ ఇన్వెస్టర్స్ వారి సహకారంతో సుభాష్ నగర్ డివిజన్, సూరారం కాలనీ, మరాఠీ బస్తీలోని ఎంపీపీ స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు బడి పిల్లలకు స్కూల్ బ్యాగ్‌తో పాటు, నోట్ బుక్ పెన్సిల్లు కంపస్ బాక్సులను మాజీ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతు డివిజన్‌లోని దాతల సహకారంతో ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేసేందుకు కృషి చేస్తానని అన్నారు. గతంలో గ్లాండ్ ఫార్మా కంపెనీ సహకారంతో సూరారం కాలనీలో ఉన్నతపాఠశాలలో తరగతి గదుల నిర్మాణం చేసుకోవడం జరిగిందని అన్నారు. అన్ని దానాలలో విద్యధానం గొప్పదని నమ్ముతానని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విషయంలో సహకరిగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, చారిటబుల్ చైర్మన్ వీణ జెన్, స్కూల్స్ వింగ్ ఇన్చార్జ్ రేష్మ సంచిట్టి, పాఠశాల హెడ్ మినిస్ట్రెస్ సంగీత, టీచర్లు గాయత్రీ దేవి, శిరీష, నాగమణి డివిజన్ మహిళా ప్రెసిడెంట్ మంగ, వరలక్ష్మి, ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భర్త కనిపించడంలేదని భార్య ఫిర్యాదు

**గోషామహల్, నవంబర్ 15ప్రభాతవార్త:** రోజు మాదిరిగానే తమ్ముని ద్విచక్రవాహనంపై వదిలి వెళ్లినఅన్న కనిపించడం లేదని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈసంఘటన గోషామహల్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది.ఎస్.ఐ అరవింద్‌గౌడ్ కథనం ప్రకారం... వివరాలు ఇలా ఉన్నాయి. పురానాపూల్ మురళీనగర్ ప్రాంతానికి చెందిన కె.యాదయ్య కుమారుడు చంద్రశేఖర్(24),అక్టోబర్ 31వ తేదిన ఉదయం 10గంటల 30 నిమిషాలకు రోజు మాదిరిగానే ద్విచక్రవాహనంపై తమ్ముడు గణేష్‌ను పురానాపూల్ ధర్తిమాత దేవాలయం సమీపంలో విడిచిపెట్టి వస్తుంటాడు.కానిఅక్టోబర్ 31 తమ్ముని విడిచి పెట్టిన అన్న చంద్రశేఖర్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది.నవంబర్ 1వ తేదిన చంద్రశేఖర్‌భార్య కె.స్వాతి గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తన భర్త కనిపించడంలేదని పోలీసులకు విన్నవించింది.పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దాదాపు కుటుంబ సభ్యులతో వెతికినాఆచూకి తెలియ రాలేదన్నారు.ఇంటి ద్విచక్రవాహనంపై వెళ్లిన సమయంలో ఒంటిపై బ్లాక్ అండ్ వైట్‌షర్టు,బ్లూప్యాంట్ ఉందన్నారు.చంద్రశేఖర్ ఎక్కడైనా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఎస్ఐ అరవింద్‌గౌడ్ సెల్ నెంబర్8712660476 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కేసును గోషామహల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివా సులు ఆధ్వర్యంలో ఎస్ఐ అరవింద్‌గౌడ్ దర్యాప్తు చేస్తున్నారు.

# రైతు రత్న అవార్డులు
### - 20లోగా దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త**

తెలంగాణ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్, సొసైటీ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ సంస్థ సమన్వయంగా వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసిన రైతులకు రైతు రత్న అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాయి. ఈ మేరకు దీనికి సంబంధించి తెలంగాణ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్ బీ కృపాకర్‌రెడ్డి ఒక ప్రకటలో వీటి వివరాలు తెలిపారు. ఈ పురస్కారాలకు ఈ నెల 20వ తేదీలోగా రైతులు తమ దరఖాస్తుల పంపాలని సూచించారు. తమ దరఖాస్తులను స్థానిక వ్యవసాయ అధికారులకు సమర్పించ వచ్చన్నారు. లేకున్నట్లయితే పోస్టు ద్వారా కూడా రైతులు తమ దరఖాస్తులను సమర్పించవచ్చని చెప్పారు. పోస్టు ద్వారా పంపే వారు ఇంటి నంబర్ 14298/4, వీధి నంబర్ 1, అశోక్‌నగర్ హైదరాబాద్-500020కు పంపవచ్చునని సూచించారు. కాగా సుస్థిర, సమీకృత, వినూత్న వ్యవసాయ, ఉద్యానపంటల సాగు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయరంగంలో విశేషంగా రాణించే రైతులకు ఈ పురస్కారాలకు ఎంపిక చేయనున్నట్టు వెల్లడించారు. ఎంపిక చేసిన ఈ అవార్డులను డిసెంబర్ 3,4 తేదీల్లో కన్హశాంతివనంలో నిర్వహించే మహాకిసాన్ మేళా-2025లో అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

### ఉత్సాహభరితంగా బాలల దినోత్సవ వేడుకలు

**నాంపల్లి, నవంబరు 15 ప్రభాతవార్త :** జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని ప్రభుత్వ జవహర్ బాలభవన్‌లో వేడుకలు వైవిధ్య, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలభవన్ సంగీత నృత్య విభాగాల చిన్నారి విద్యార్థులచే పలు అంశాలతో సంగీత, నృత్య ప్రదర్శనలు నవరసభరితం, రమణీయంగా జరిగాయి. ఇందులో జీహెచ్ఎం ఆలియా పాఠశాల, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల బాలబాలికలచే వివిధ ప్రదర్శనలు అత్యంత వైభవంగా నిర్వహించబడి అందరి ప్రశంసలు అందుకున్నాయి. కార్యక్రమంలో జవహర్ బాలభవ న్ సంచాలకురాలు ఎస్.విజయలక్ష్మి,టీచర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## హైకోర్టు ఆదేశాలతో అక్రమాల తొలగింపు


జేసిబితో చదును చేస్తున్న దృశ్యం

**దుండిగల్, నవంబర్ 15 ప్రభాతవార్త:** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేటలోని గాయత్రి గార్డెన్స్‌లో అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న బస్సు పార్కింగ్, కూలీలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను హైకోర్టు ఆదేశానుసారం శనివారం మున్సిపల్, పోలీస్‌శాఖ అధికారులు సంయుక్తంగా తొలగించారు. ఈసందర్భంగా కమీషనర్ వేంకటేశ్వర్‌నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో సిఐ సతీష్, ఎస్సై రామ్మోహన్ రెడి,రెవిన్యూ ఆఫీసర్ నాగేష్‌బాబు, ఇంజినీర్ సురేందర్ నాయక్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిట్స్‌వచ్చి పారిశుధ్య కార్మికుడు మృతి

**కుత్బుల్లాపూర్, నవంబరు 15 ప్రభాతవార్త :** పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తు చెత్తను తగలబెడుతున్న సమయంలో ఫిట్స్‌వచ్చి ఆ మంటలోపడి కార్మికుడు మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం జనగాం జిల్లా కేశవపురంకు చెందిన పి.ఆంజనేయులు కుత్బుల్లాపూర్ సర్కిల్ పారిశుద్ధ్య విభాగంలో గత 25 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తు బార్య, పిల్లలను పోశిస్తున్నాడు. శనివారం ఉదయం పారిశుద్ధ్య కార్మికులు చెత్తను ఏరుతఉండగా మంటల్లో కాలిన శవం కార్మికులకు కనిపించింది. ఇది గుర్తించిన కార్మికులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం విచారణలో భగత్‌సింగ్‌నగర్‌లో నివవాసముండే పి.ఆంజనేయులు పారిశుద్ధ్య విభాగం పనిలో భాగంగా ఈనెల 14న గురువారం ఉదయం విధులకు వెళ్లాడు. అయితే సాధారణంగా మధ్యాహ్నం రెండుగంటలకు డ్యూటీనుండి రావాల్సిన యజమాని రాకపోవడంతో వెతికినా ఫలితంలేకపోవడంతో ఆంజనేయులు బార్య బాలమణి, కుమారులు శ్రీను, కుమారై శిరీషాలు పోలీసులను ఆశ్రయించారు. అయితే శనివారం గుర్తుతెలియని శవం చెత్తఏరుతుండగా కనిపించడంతో ఆశవాన్ని పరిశీలిస్తే మరణించింది పారిశుద్ధ్య కార్మికుడు ఆంజనేయులు అని తేలింది. ఈమేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించారు

# యువత మానసిక సవాళ్లను ఎదుర్కోవాలి



**-తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం**

**అత్తాపూర్ నవంబరు 15, ప్రభాతవార్త :**

యువత తమ భవిష్యత్తు పై దుష్ప్రభావాన్ని కలిగించే ఆలోచనలతో అప్రమత్తంగా ఉండాలని, జీవితంలో ఎదురయ్యే మానసిక సవాళ్లను ఎదుర్కొంటే ఆత్మవిశ్వాసమే ఆయుధంగా నిలుస్తుందని, మానసిక వికాసంతోనే అద్భుతాలు సృష్టించవచ్చని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం ఏ కరీం అన్నారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మరియు మేరా యువ భారత్ తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం రాజేంద్ర నగర్ లోని కోఆపరేటివ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో జాతీయ స్థాయిలో గిరిజన యువజన మార్పిడి కార్యక్రమాన్ని మానసిక వ్యక్తిగతతో పాటు సమాజ అభివృద్ధి ఒక మెట్టు ఉండేలా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం ఏ కరీం ప్రధాన శిక్షకులుగా పాల్గొని యువతీ యువకుల కోసం మానసిక శక్తివంతమైన ఆచరణాత్మక సెషన్ ప్రయోగాత్మక పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ డాక్టర్ ఎం ఏ కరీం మాట్లాడుతూ.. యువత మనోవికాసాన్ని పెంపొందించుకుని మానసిక ఒత్తిడిని అధిగమిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని, తన వ్యక్తిగత స్థాయికి తగినట్టుగా నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని అన్నారు. అవకాశాలన్నింటిని అదృష్టంగా భావించాలని, అలాగని అవి వారసత్వాలు కూడా కావని వాటిని పట్టుదలతో సాధించుకోవాలి అని ఆయన స్పష్టం చేశారు. అవకాశాలు అన్ని రంగాలలో ఉన్నాయని వాటిని అందుకోవాలన్న తపన ఉంటే అవి అందరి సొత్తు అని అన్నారు. విజయం ఏ ఒక్కరి సొత్తు కాదు అది అందరికీ సాధ్యమే అని నిరూపించారు. డిజిటల్ మరియు అంతర్జాల రూపంలో ఎదురయ్యే మానసిక వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత సైకలాజికల్ అసెస్మెంట్ టెక్నిక్స్ లను మనసు మల్లింపు విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరీం ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా యువజన అధికారిని కుష్భూ గుప్తా పూర్తి స్థాయిలో తన బాధ్యతలను నిర్వహించి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. హైదరాబాద్ జిల్లా యువజన ప్రతినిథి మనోజ్ తన అద్భుత వ్యాఖ్యానంతో సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమ నిర్వహణలో యువజన సంఘాల ప్రతినిధులు, యూత్ వాలంటీర్స్ పవన్, రుత్విక్, రాకేష్, అజిత్, తరుణ్, జగన్, మధు, శివ అత్యంత కీలకమైన పాత్ర పోషించారు. అనంతరం కుమారి పావని కథక్ నృత్య ప్రదర్శన, కుమారి లిఖిత సెమీ క్లాసికల్ డ్యాన్స్ అందరిని ఆకట్టుకునే విధంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా, జార్ఖం డ్, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి విచ్చేసిన యువజన ప్రతినిధులు మరియు ఆయా రాష్ట్రాల నుంచి విచ్చేసిన యువతీ యువకులు పాల్గొన్నారు.

## నిజాంపేట్‌లో విద్యార్థులు మోడల్ ఐక్యరాజ్య సమితి సమావేశాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

**నిజాంపేట్, నవంబర్ 15, ప్రభాతవార్త**

విజ్ఞాన బో ట్రీ స్కూల్ నిజాంపేట్‌లో విద్యార్థులు మోడల్ ఐక్యరాజ్య సమితి సమావేశాలను శనివారం అద్భుతంగా నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి విచ్చేశారు. గౌరవ అతిథిగా మాజీ ఐఏఎస్ అధికారిణి పూనం మాల కొండయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాలంలో అభివృద్ధిలో స్త్రీ పురుషభేదం లేదన్నారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసంలో కీలకపాత్ర పోషిస్తాయని, క్రీడలను కూడా హాబీగా వృత్తిగా స్వీకరించవచ్చు అని అన్నారు. విజ్ఞాన్ విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్థానిక జాతీయ అంశాలతో పాటు అంతర్జాతీయ అంశాలోకూడ అవగాహన కలిగించటం ప్రోత్సహించటం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ వైట్ చైర్పర్సన్ శ్రీమతి రాణి రుద్రమదేవి మాట్లాడుతూ విజ్ఞాన్ విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి కృషి చేస్తుందని, విజ్ఞాన్ విద్యార్థుల కోసం ఈవెంట్లు నిర్వహిస్తుందని, నిత్యం ఏదో ఒక ఈవెంట్ పాఠశాలలో జరుగుతుందని, ప్రతి విద్యార్థి ఏదో ఒక ఈవెంట్‌లో పాల్గొనేలా చూస్తామని అన్నారు. అలాగే వార్షికోత్సవం లాంటి కార్యక్రమాలు ప్రోగ్రామ్స్, బడ్జెట్, రిపోర్టులు తయారుచేసి చదవడం మొదలైనవన్నీ పూర్తిగా విద్యార్థులే చూసుకుంటారని, ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకోవడం, వారికి పుస్తకాలు అందజేయడం, వృద్ధాశ్రమాలకు సేవలను అందించడం, దానధర్మాలు చేయడం లాంటి కమ్యూనిటీ సర్వీసెస్ కూడా విజ్ఞాన్ ప్రోత్సహిస్తుందన్నారు. చదువుతోపాటు క్రీడలకు, ఇతర అంశాలకు కూడా కర్కులంలో ప్రాధాన్యమిస్తామని,స్ఫూర్తిదాయకమైనటువంటి వ్యక్తులను తీసుకువచ్చి విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్ పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ ఏవిఎన్ పద్మజ, విద్యార్థులు, తల్లిదండ్రులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలతో స్థలాలు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్


ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన ఉప్పల్ పోలీసులు దృశ్యం.

**ఉప్పల్, నవంబరు 15 ప్రభాతవార్త :** ఇతరులకు చెందిన ప్లాట్లను నకిలీ పత్రాలు సృష్టించి విక్రయిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మారుతీనగర్‌కు చెందిన బిఆర్ విజయకుమారి (58) అనే మహిళకు 1993లో ఉప్పల్ విజయపురికాలనీలో కట్నం కింద 200 గజాల స్థలం ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఆమె బతికి ఉండగానే చనిపోయినట్లు మరణ ధృవీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి తన కూతురు చాటల రమ్య అలియాస్ జజాల రమ్య రాజీవ్‌గృహకల్ప సూరారం, తానే స్థలానికి వారసురాలునని చెప్పి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. దీనిని తిరిగి స్వరూప్‌నగర్‌లో నివసించే రాచాల వెంకటరమణ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుని అనంతరం విజయపురి కాలనీకి చెందిన రంగ సతీష్‌గౌడ్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. అందులో వంద గజాల స్థలాన్ని చాకలి లక్ష్మీదేవికి అమ్మి మోసం చేశారని తెలిపారు. అదే విధంగా ఉప్పల్ సాయిబాబా కాలనీలో కూడా మరో ప్లాట్‌ను నిజమైన యజమాని బొమ్మ సముద్రం అనురాధ బతికి ఉండగానే చనిపోయినట్లు మరణ ధృవీకరణ పత్రం సృష్టించి కాయ ఉపేందర్‌కు అమ్మి మోసం చేశారని తెలిపారు. వీరికి ఈస్ట్ గోదావరికి చెందిన కార్తీక్‌రెడ్డి అలియాస్ కార్తికేయ అనే వ్యక్తి సహకరించారని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.ఇతరు పరారీలో ఉన్నాడని, మిగిలిన ముగ్గురు నిందితులైన రాచాల వెంకటరమణతోపాటు, రంగ సతీష్‌గౌడ్, చాటాల రమ్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### దయాబెటిస్ రోగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి : డాక్టర్ ఆర్ ఎం అంజనా


దయాబెటిస్ రోగులకు మెమొంటోను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

**మెహిదీపట్నం, నవంబర్ 15, ప్రభాతవార్త :** ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితేనే దయాబెటిస్ ను అధిగమించ గలుగుతామని డాక్టర్ మోహన్ దయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎం. అంజనా తెలిపారు. ప్రపంచ దయాబెటిస్ దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ మోహన్ దయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం గుడిమల్కాపూర్ హోటల్ కినారా గ్రాండ్ లో దయాబెటిస్ రోగులకు అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఆర్. ఎం అంజనా ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... దయాబెటిస్ ఒకరి ఆత్మస్థైర్యాన్ని పరీక్షించినా, సంకల్పం మరియు ఆశతో జీవించే వారిని అది ఓడించలేదని ప్రతి అవార్డు గ్రహీత మనకు గుర్తు చేస్తున్నారని తెలిపారు. సరైన సంరక్షణ జీవనశైలి మరియు సానుకూల దృక్పథంతో దయాబెటిస్ ను సమర్థంగా నియంత్రించవచ్చు అన్నారు. మా లక్ష్యం కేవలం చికిత్స కు మాత్రమే పరిమితం కాదని, అది జీవితాలను శక్తివంతం చేయడం కూడా మా బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డైట్ ఎక్స్ పో ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో ఆచరణాత్మక పోషకాహార చిట్కాలు మరియు ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలను ప్రదర్శించామని తెలిపారు కార్యక్రమంలో. దయాబెటిస్ రోగులు పాల్గొన్నారు.


హైదర్షాకోట్ శాంతినగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో జరిగిన లక్ష్మీగణపతి, రామలింగేశ్వర విగ్రహాల ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.


IN THE COURT OF THE HON'BLE XVII ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT COMPLEX AT: HYDERABAD
O.S. NO. 1258 OF 2024

Between:
1. Smt. Ramaseeta Narahari,
2. Smt. Janaki Narahari,
3. Smt. Revati Devi Pothamsetty,
4. Mr. Madhav Rao Narahari, (Plaintiffs No. 1 to 4 are represented by their attorney) Mr. Dhanwada Venugopal ... Plaintiff/s

AND
1. Tahsildar, Asif Nagar
2. Sub – Registrar, Golconda
3. All concerned .... Defendants

To,
All Concerned

PUBLIC NOTICE

Please take notice that the abovenamed Plaintiffs filed the suit for declaration of legal heirs in favor of Plaintiffs No.1 to 4, represented on behalf of their Advocate with respect to Suit Schedule Property of the Late Shri. N. A. Rao., i.e., All that piece and parcel of the vacant house site, plot no. 20 admeasuring 299 Square yards, situated at Gudimalkapur, Ward No.12 of the Municipal Corporation of the Hyderabad and the above said Suit i.e., O.S. No. 1258 OF 2025 stands posted on 27.11.2025 (November 27th 2025) at 10-30 A.M for your appearance. If any person/s is having any right, title or interest may appear before the said Hon'ble court either in person or through an Advocate with your defence if any, failing which the suit will be heard and decided ex- parte.

(BY ORDER OF THE HON'BLE COURT)
G. VYSHNAVI
ADVOCATE
Address at: Flat No. B3, #11-5-397/1, Rehmat Manzil, Red Hills, Hyderabad Telangana - 500004
Ph: +91 73827 14145


## పెండింగ్ పనులు పూర్తి చేయాలి : కొంతం దీపిక


బండిమెట్టులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కార్పోరేటర్ కొంతం దీపిక

**అడ్డగుట్ట, నవంబర్ 15 ప్రభాతవార్త:** మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న పెండింగ్ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక జిహెచ్ఎంసి ఇంజనీర్లు కాంట్రాక్టర్లకు సూచించారు. శనివారం ఆమె డివిజన్‌లోని బండి మెట్టు, మారుతీ వీధి పరసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రశాంత్, సుభాష్,గణేష్, సాయి, రమేశ్ యాదవ్, హరి, నర్సింగ్ పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
సంక్షిప్త నిట్ నం. 42/SE(M)/Sec-bad Zone/GHMC/2025-26, తేది: 15.11.2025.
క్ర.సం.1. నిట్ నం: పైన పేర్కొన్నది. పనుల సంఖ్య: 01 పని. అంచనా మొత్తం: (రూ.లక్షలలో) రూ.143.00. మొత్తం 01 పని రూ. 143.00. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ, సమయం: బిడ్ దాఖలు ప్రారంభ తేదీ, సమయం: 17.11.2025 మ.1.00 గం, బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 24.11.2025 మ.1.00 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం.: SE, సికింద్రాబాద్ జోన్, GHMC సెల్ నం. 9963550657. తదుపరి వివరాలు https://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, GHMC
DIPR.No.10784-PP/CL/Advt/1/2025-26, తేది: 15.11.2025

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సంక్షిప్త టెండర్ ప్రకటన
క్ర.సం.1, నిట్ నం.: 26/SE-M/LBNZ/GHMC/J2&J3/2025-26 తేది: 15.11.2025.
పని పేరు: GHMC, LB నగర్ జోన్‌లో ప్రహరీగోడ పని. 1 సం. మొత్తం (రూ.లక్షలలో): 140.00, GHMC, LBనగర్ జోన్‌లో పార్కు నిర్వహణ పని 1 సం, క్రీడా మైదానం అభివృద్ధి పని 1 సం., మొత్తం (రూ.లక్షలలో): 189.00 మొత్తం సొమ్ము 03 పనుల కొరకు: 329.00. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ/సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 17.11.2025 మ.3.00 గం, బిడ్ దాఖలు ముగింపు తేదీ: 20.11.2025 మ.3.00 గం, టెక్నికల్ బిడ్ తెరచు తేదీ: 20.11.2025 మ.3.30 గం, ప్రైస్ బిడ్ తెరచు తేదీ: 20.11.2025 మ.3.45 గం, డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 17.11.2025 మ.3.00 గం, బిడ్ దాఖలు ముగింపు తేదీ: 24.11.2025 మ.3.00 గం, టెక్నికల్ బిడ్ తెరచు తేదీ: 24.11.2025 మ.3.30 గం, ప్రైస్ బిడ్ తెరచు తేదీ: 24.11.2025 మ.3.45 గం. పేరు, చిరునామా, కార్యాలయం ఫోన్ నం: SE-M, LBNZ, GHMC జోనల్ ఆఫీస్, గడ్డిఅన్నారం, హైదరాబాద్. 9701362708. తదుపరి వివరాలకు https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్-M, LB నగర్ జోన్, GHMC
DIPR.No.10770-PP/CL/Advt/1/2025-26, తేది: 15.11.2025

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : ఏసిపి



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఏసిపి సుబ్బరామిరెడ్డి, ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 15, ప్రభాతవార్త:**
శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి, ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి లు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుమారు 8 మంది రౌడీషీటర్లకు వారు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి క్రిమినల్ కార్యకలాపాలలో పాల్గొనరాదని కఠినంగా హెచ్చరికలు జారీ చేశారు. శాంతి భద్రతలను పరిరక్షించడమే పోలీసుల కర్తవ్యమని పేర్కొన్నారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి : ఎమ్మెల్యే బలాల



అజంపుర డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చిత్రంలో అబ్రార్, కొత్త రఘు, అలీం తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 15 ప్రభాతవార్త:**
ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్ లోని పలు ప్రాంతాలలో రూ. 3 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందని వివరించారు. నియోజకవర్గంలో త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని వివరించారు. నియోజకవర్గం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో అజంపుర డివిజ న్ ఎంఐఎం అధ్యక్షుడు అబ్రార్, నాయకులు ఆలీం, కొత్త రఘు, అన్వర్, బింగి నరేందర్ గౌడ్, అధికారులు మల్లికార్జున్, మహేష్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సారధ్యంలో అన్ని విధాలుగా రాష్ట్రం అభివృద్ధి

**: డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి**



నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలను పంపిణీ చేసి సంబురాలు నిర్వహిస్తున్న ఆర్. రాజేశ్వర్ రెడ్డి తదితరులు

**మలక్ పేట , నవంబర్ 15, ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ప్రముఖ విద్యావేత్త, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆర్. రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో విజయం సాధించడంతో మూసారంబాగ్ శాలివాహననగర్ లో నాయకులు, కార్యకర్తలతో కలిసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతి కోసం పాటుపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్సి విభాగం రాష్ట్ర కన్వీనర్ భొనగిరి చంద్రశేఖర్, నాయకులు గంటా సుదర్శన్, మాధవరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్ సైదులు పాల్గొన్నారు.

## భూలక్ష్మీనగర్ అభివృద్ధికి చర్యలు : కార్పొరేటర్



బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 15 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. భూలక్ష్మీనగర్‌లో పర్యటించిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ యుజిడి సమస్య పరిష్కరించిన తర్వాత బస్తీ మొత్తం నూతన సిసి రోడ్లు వేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో పలువురు బస్తీ వాసులు పాల్గొన్నారు.

## సరమౌంట్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు



ఉప్పల్ సర్‌మౌంట్ స్కూల్‌లో జరిగిన బాలల దినోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 15 ప్రభాతవార్త :**
ఉప్పల్ డివిజన్ పరిధిలోని సర్‌మౌంట్ స్కూల్‌లో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నారులకు అన్ని విధాలుగా సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. పిల్లలు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్‌మౌంట్ స్కూల్ చైర్మన్ బాణాల విజయేందర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రావ్యారెడ్డి, ప్రిన్సిపాల్ చైతన్య మురళి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి సర్కిల్‌లో రహదారులు అస్తవ్యస్తం

**-ప్రాణ సంకటంగా వాహనదారుల ప్రయాణం**
**-చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు**



**నేరెడ్ మెట్, నవంబర్ 15,ప్రభాతవార్త.**
మల్కాజిగిరి సర్కిల్‌లో రహదారి సమస్యలు రోజు రోజుకూ తీవ్రమవుతూ ప్రజలను నరకయాతనకు గురిచేస్తున్నాయి. సర్కిల్ పరిధిలోని దాదాపు ప్రతి డివిజన్‌లో రహదారులు గుంతలతో చెదిరిపోయి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చూసినా అస్తవ్యస్తంగా ఉన్న రహదారులు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి.వాయపురి, డిఫెన్స్ కాలనీ, దీన్‌దయాల్ నగర్, కాకతీయ నగర్ , మధురనగర్,సంతోష్ మా నగర్, వెంకటేశ్వర కాలనీ, సమతా నగర్ తదితర కాలనీల్లో అంతర్గత రహదారులు మరింత దారుణ స్థితికి చేరాయి. పచ్చదనానికి ప్రసిద్ధిగా పేరుపొందిన వాయపురి అంతర్గత రోడ్లు భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా ధ్వంసమవడంతో ప్రయాణం కష్టతరమైంది.

**ప్రధాన మార్గాలు గుంతలతో మా రణహోమం సృష్టిస్తున్నాయి.**
మల్కాజిగిరి (ఆర్‌డిఓ ) రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ప్రధాన రహదారి, వాయు పురి సొసైటీ వద్ద అంతర్గత రోడ్లు, గౌరీ శంకర్ అపార్ట్మెం ట్-లిటిల్ పెరల్స్ స్కూల్ రహదారి, ఓల్డ్ పీఎస్ చౌరస్తా- రైతు బజార్ రహదారి అన్నీ ఒకే విధమైన దుస్థితిలో ఉన్నా యి. కంకర, జల్లి, డాంబర్ పోయి అరపిటి లోతు గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రతిరోజూ ప్రమాదాలను తప్పించుకుంటూ ప్రయాణించాల్సి వస్తోంది.మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా ఈ గుంతల్లో నీరు నిలిచి రహదారులు మరింత ప్రమాదకరంగా మారిపోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కమర్షియల్ కట్టడాలు..వాయుపురి కాలనీకి శాపంగా మారిన వైనం**
పచ్చదనానికి పరాకాష్టగా ఉన్న వాయపురి కాలనీ నేడు పూర్తిగా కాంక్రీట్ జంగల్ గా మారింది.రెసిడెన్షియల్ జోన్లలోనే అనధికారికంగా భవనాల అంతస్తులు పెంచడమే కాకుండా కమర్షియల్ కార్యకలాపాలు పెరగడంతో భారీ వాహనాల గమనం అధికమై రోడ్లు పూర్తిగా నాశనమయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్లను సరిచేయాలనే అవగాహన కూడా అధికారుల్లో కనిపించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రహదారులే అభివృద్ధికి పునాది"**
ప్రతి దేశ అభివృద్ధి రహదారుల నాణ్యతపై ఆధారపడి ఉంటుందని, రోడ్ల అభివృద్ధి లేని ప్రదేశాల్లో ఇతర అభివృద్ధి అసంభవమని పౌరులు చెబుతున్నారు. రహదారులు సక్రమంగా ఉండితేనే ఆ ప్రాంతం ఎదగడానికి అవకాశాలు ఉంటాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.సర్కిల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రహదారుల పునర్నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే మల్కాజగిరి అభివృద్ధి దూరమై ప్రజల కష్టాలు మరింత పెరగనున్నట్లు స్పష్టం చేస్తున్నారు. అధికారులు ప్రజాప్రతినిలో ప్రజా సంక్షేమాన్ని మార్చి స్వలాభాన్ని కోరుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తద్వారా మల్కాజ్గిరి సర్కిల్లో రోడ్లు అద్వాన్నంగా ఉండడానికి కారణమని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్ల అభివృద్ధిపై చర్యలు చేపట్టాలని పలు సంక్షేమ సంఘం నాయకులు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# పీర్జాదిగూడ ప్రగతికి నమూనా : మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



పరిశోధన విద్యార్థులతో ముఖాముఖిలో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్న దృశ్యం

**మేడిపల్లి, నవంబర్ 15 ప్రభాతవార్త ;**
తెలంగాణ రాష్ట్రంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ ప్రగతికి నమూనా అని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌగోళిక శాస్త్ర విభాగం, ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన సుమారు 30 మంది దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధన విద్యార్థులు, వివిధ యూనివర్సిటీల అధ్యాపకులు, ఉద్యోగులు శనివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పరిశోధన విద్యార్థులతో జరిగిన "స్టూడెంట్స్ విత్ మేయర్" ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కార్పోరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా పార్కులు, తడి, పొడి చెత్త సేకరణ, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కు, వైకుంటధామం, కోవిడ్ సెంటర్ నిర్వహణ, వార్డు ఆఫీసర్స్ వ్యవస్థ, సెట్విన్ బ్రాంచ్ ఏర్పాటు, విద్యావాలంటీర్ల నియామకంతో పాటు ప్రజల భాగస్వామ్యం తో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు, వాటి వలన ప్రజలకు కలుగుతున్న మేలును మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధన విద్యార్థులకు వివరించడంతో పాటు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మాజీ మేయర్ సమాధానాలు చెప్పారు. ప్రజలకు సేవ చేయాలనే తమ సంకల్పం ఉంటే ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేయొచ్చన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ప్రత్యేక నిధులు ఇచ్చి అభివృద్ధి పనులను ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వైకుంఠదామంను వీక్షించి, అందులో ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన విద్యార్థుల పీల్డ్ విజిట్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఉషా, డా. సుదర్శన్, వివిధ రాష్ట్రాలకు విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో క్రీడా దినోత్సవ వేడుకలు



హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన క్రీడా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర క్రీడా సలహాదారులు ఎపి.జితేందర్‌రెడ్డి తదితరులు

**రామంతాపూర్,, నవంబరు 15 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతపూర్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 46వ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర క్రీడల సలహాదారులు ఎపి. జితేందర్‌రెడ్డి, భారత మహిళ క్రికెటర్ జి.త్రిష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగాజ విద్యార్థి నాయకులు రాగ ప్రణవిరెడ్డి,పునీత్ మార్గదర్శనంలో విద్యార్థులు కవాతు చేశారు. అనంతరం ప్రాధమిక, ఉన్నత పాఠశాలకు విద్యార్థులకు పరుగు పందాల పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం పిల్లలు యోగా ఆసనాలు, మే పోల్ డాన్స్,ఆపరేషన్ సింధూర్, డ్రిల్ విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం పాఠశాల ప్రధానాచార్యులు డాక్టర్ సల్లారం నరసింహారెడ్డి పాఠశాల నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విజయానికి ఓటమి ద్వారా అనుభవాన్ని అందిస్తాయని తెలిపారు. అనంతరం క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ ఏడాదికి విజయనగర హౌస్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. ముఖ్య అతిధి ఎపి జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నుంచి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరారని గుర్తు చేశారు. విద్యార్థుల ఆశయాలకు అనుగుణంగా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు గుస్తీనోరియా, వేణువర్ధన్,శ్యాంమోహన్, మహమ్మద్ మసీయుద్దీన్, డా.స్కందబాలి, ప్రవీణ్, ప్రవీణ్, వరంగల్ పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్ సరితారెడ్డి, ప్రమీలారెడ్డి, రమేష్, పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో మోడీ చిత్రపటాన్ని, ఫ్లెక్సీలను తొలగించడంపై బిజెపి అభ్యంతరం



బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో మోడీ చిత్రపటాన్ని తిరిగి ఏర్పాటు చేయించిన రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, నవంబర్ 15 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోడి చిత్రపటాన్ని అదే విధంగా కార్పొరేషన్ పరిధిలో మోడీ జన్మదిన ఫ్లెక్సీలను తొలగించడంపై బిజెపి నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు కమీషనర్ సరస్వతి వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పార్టీలపై కమీషనర్ వివక్ష చూపుతున్నారని వారు ఆరోపించారు. కార్పొరేషన్ కార్యాలయంలో గతంలో ఏర్పాటు చేసిన మోడీ చిత్రపటానికి తొలగించడం ప్రధానిని అవమానించడమేననీ వారన్నారు. అదే విధంగా మోడీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించిన కార్పొరేషన్ రోజుల తరబడి ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. కమీషనర్ పూర్తిగా వివక్ష చూపుతున్నారని వారు ఆగ్రహం చేశారు. కాంగ్రెస్ వారి ఒత్తిళ్ళకు లొంగి కమీషనర్ పనిచేస్తున్నారని వారు ఆరోపించారు. కాగా కార్పొరేషన్ ఆవరణలో తిరిగి మోడీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రేసు నర్సింహారెడ్డి, క్యారగారి అరవింద్, సైదులు, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ గుర్రం లక్ష్మారెడ్డి మృతి



గుర్రం లక్ష్మారెడ్డికి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తున్న టియుఎఫ్ఐడిసి చైర్మన్, రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 15 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం మాజీ డైరెక్టర్ గుర్రం లక్ష్మారెడ్డి మృతి చెందారు. గత కొంత కాలం నుండి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. లక్ష్మారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రైతుగా, రియల్ ఎస్టేట్ వ్యాపారిగా, రాజకీయ నాయకునిగా గుర్తింపు ఉన్న లక్ష్మారెడ్డి మృతితో గుర్రంగూడ పాత గ్రామంలో, శ్రీనివాసపురం తదితర కాలనీల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. సరూర్‌నగర్ మాజీ ఎంపిపి గుర్రం నర్సింహారెడ్డి శుక్రవారం ఉదయం లక్ష్మారెడ్డి నివాసానికి వచ్చి నివాళులర్పించారు. లక్ష్మారెడ్డి మరణ వార్త తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, టియుఎఫ్ ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి గుర్రంగూడకు విచ్చేసి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, పలువురు మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు లక్ష్మారెడ్డి భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**మన్సూరాబాద్, నవంబర్ 15 ప్రభాతవార్త :** మన్సూరాబాద్ ఎరుకల నాంచారమ్మ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, యూత్ ఫర్ సేవాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ నుండి జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ వైద్యులు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి, ఆరోగ్య సలహాలను అందజేసి, మందులు పంపిణీ చేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి మందులను అందజేశారు. ఈ శిబిరంలో జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు నరసింహమూర్తి, గణేష్, ఫిజియోథెరపిస్ట్ ఎం. శ్రీనివాస్, యూత్ ఫర్ సేవా ప్రతినిధులు చరణ్, రాజశేఖర్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి, డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ అధ్యక్షుడు గండికోట భీమరాజు, బి.సిద్ధు, క్రాంతి, సైదులు, లింగయ్య, దుర్గయ్య, మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు, విక్రమ్, మల్లారెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థులు వాలంటీర్‌లుగా పాల్గొన్నారు.

## శబరికి తరలిన అయ్యప్పస్వామి భక్తులు



ఇరుముడి కట్టుకున్న అయ్యప్పస్వామి భక్తులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 15 ప్రభాతవార్త:** నల్లని దుస్తులు ధరించి మెడలో తులసిమాల వేసుకొనిఅయ్యప్పస్వామి దీక్ష చేపట్టి 41 రోజుల మండలం పూర్తయిన సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులు ఇరుముడి కట్టుకొని శబరిమలకు తరలివెళ్లారు. వక్కలంక శ్రీనివాస్‌రావు గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం గడ్డిఅన్నవరం శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి దేవస్థానంలో మాలధారణలో ఉన్న 9మంది అయ్యప్పస్వామి భక్తులు ఇరుముడి కట్టుకుని శబరియాత్రకు భయలుదేరారు. దీక్షలో ఎంతో నిష్టగాఉన్నా అయ్యప్పస్వామి భక్తులు శబరిమలైలోని అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరగా వారికి భక్తులు నమస్కరించారు. శబరిమలై తరలి వెళ్లిన వారిలో స్వాములు వక్కలంక శ్రీనివాస్‌స్వామి, నాయకి విజయ్‌స్వామి, రాజాస్వామి, సతీష్‌స్వామి, గోవింద్‌స్వామి, హనుమంతుస్వామి, రవిస్వామి, సురేష్‌స్వామి, కార్తికేయ, అయ్యప్ప స్వాములు ఉన్నారు.

## ఉప్పల్ సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి : పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్ న్యూ విజయపురికాలనీలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 15 ప్రభాతవార్త :**
ఉప్పల్ డివిజన్ సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ న్యూ విజయపురికాలనీలో రూ.కోటి 83లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల స్థానిక కార్పొరేటర్ రజితారెడ్డి ఇచ్చిన హామీ మేరకు న్యూ విజయపురి కాలనీలో డ్రైనేజీ నిర్మాణం, కొత్త మంచినీటి పైపు లైన్లు ఏర్పాటు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు, మంచినీటి పైప్‌లైన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు తెల్కల మోహన్‌రెడ్డి, న్యూ విజయపురి కాలనీ అధ్యక్షులు ఎల్. వెంకటేష్, పబ్బు నర్సింహా, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్‌రెడ్డి, పివిపాపయ్య, పెద్దోళ్ల నాగి రెడ్డి, రాసా శంకరయ్య, శివన్నారాయణ, పూస సత్తయ్య, భాస్కర్, దానయ్య, కురుమ నర్సింహా, వెంకటేశ్వర్‌రావు,అలుగుల అనిల్, కాటేపల్లి విజయ్ కుమార్, ఈగ రాజేష్,సతీష్ ,కాసోజు సతీష్,పద్మ, సుమిత్ర, సావిత్రి, అండాలు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలలో ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేయాలి



కిరణ్మయితో మాట్లాడుతున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, నవంబర్ 15 ప్రభాతవార్త:**
రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా హైమాక్స్ లైట్స్ ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డిప్యూటీ ఈఈ కిరణ్మయితో కార్పొరేటర్ కార్యాలయంలో శనివారం హైమాస్ట్, స్ట్రీట్‌లైట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వేర్వేరు కాలనీల్లో హైమాస్ట్‌లైట్లు, స్ట్రీట్‌లైట్లు పనిచేయకపోవడం వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై వివరించడం జరిగిందన్నారు. ప్రజల భద్రత, రాత్రి ఔట్‌డోర్ మూవ్‌మెంట్, వాహన రాకపోకలు, మహిళలు, వృద్ధులు సురక్షితంగా ప్రయాణించే విధంగా వీధుల్లో తగినంత వెలుతురు ఉండడం అవసరమన్నారు. పలు ప్రధాన చౌరస్తాలు, రోడ్లు, కాలనీ అంతర్ వీధుల్లో లైట్లు లేకపోవడంతో చీకటిలో దింగతనాలు, రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల ప్రవేశం వంటి సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాభద్రతకు సంబంధించిన పనులపై ఎప్పుడూ ముందుండి పని చేస్తామని తెలిపారు. అందుకు స్పందించిన కిరణ్మయి అవసరమైన చర్యలు తీసుకొని సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ఆర్టీసీ కాలనీకి బస్సు సర్వీసు పునరుద్దరణ : శ్రీవాణి



రామంతాపూర్ ఆర్టీసీ కాలనీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, నవంబరు 15 ప్రభాతవార్త :**
రామంతపూర్ ఆర్టీసీ కాలనీ నుండి కోఠి వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించినట్లు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ కాలనీ నుంచి కోఠి వరకు బస్సు సర్వీసును ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత కరోనా సమయం నుంచి బస్సు సర్వీసు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ఉన్నతాధికారులతో చర్చించి బస్సు సర్వీసు తిరిగి ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. రామంతాపూర్ నుంచి కోఠి వరకు 12 ట్రిప్పులు నడిపిస్తారని తెలిపారు. బస్సు సర్వీసు తిరిగి ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు పసుల ప్రభాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, ఎం.సురేష్, డి.మురళి, తమ్మల రవి, చంద్రశేఖర్, దయాకర్‌రెడ్డి,మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం: సబితా ఇంద్రారెడ్డి



సిర్వీ సమాజ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 15 ప్రభాతవార్త:** క్రీడలతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోనున్న సిరిపురం యాదయ్య మున్సిపల్ గ్రౌండ్‌లో శనివారం అఖిల భారత సిర్వీ సమాజ్ భాగ్యనగర్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె సిర్వీ సమాజ్ ప్రతినిధులతో కలిసి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలతో ఆత్మ విశ్వాసం పెంపొందుతుందనీ అంతే కాకుండా శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందని తెలిపారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని రాణించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, బడంగ్‌పేట్, మీర్‌పేట్ బిఆర్ఎస్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేష్‌రెడ్డి, నాయకులు పుట్టగళ్ళ సంతోష్, దిండు భూపేష్‌గౌడ్‌లతో పాటు క్రీడాకారులు, సిర్వీ సమాజ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇన్స్పెక్టర్ సైదులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 15 ప్రభాతవార్త:**
విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. బాలల దినోత్సవ సందర్భంగా కొత్తపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఎస్ఐ గోవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ సెల్ఫోన్ల వాడకానికి సంబంధించి విద్యార్థులకు పలు సలహాలు సూచనలు చేశారు. విద్యార్థులు మంచిగా చదువుకొని లక్ష్యాన్ని అధిగమించాలన్నారు.నేటి పిల్లలే దేశ భవిష్యత్తు అని, వారి ఎదుగులపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన పెంపొందించుకుంటూ, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ప్రేమతో ఉండాలని, విద్య, సంస్కారం, నైతిక విలువలను పెంపొందించుకోని భవిష్యత్తును మంచిగా మలుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు పెన్సిళ్లు ఇతర వస్తువులను పంపిణీ చేశారు.

## ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్న భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**




**బోడుప్పల్,నవంబర్ 15 ప్రభాతవార్త ;**
మేడిపల్లి మండల సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. దండు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి దామోదర్ రెడ్డి హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉమా మహేష్, జి దామోదర్ రెడ్డి లు మాట్లాడుతూ .. సిపిఐ పార్టీ 100 సంవత్సరాల వారోత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న, ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, నవంబర్ 20 నా సిపిఐ పార్టీ ప్రచార జాతర మేడిపల్లి చౌరస్తాలో సాయంత్రం 4 గంలకు మీటింగ్ కు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని మేడిపల్లి మండలంలో ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేస్తున్న కబ్జాదారులపై రెవిన్యూ అధికారులు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జంట కార్పొరేషన్ లో ఎక్కడ చూసిన పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాల్లో దర్శనమిస్తున్నాయని వాటి పైన కార్పొరేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి జే లక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు సిహెచ్ మాధవి, నాగరాజు, కె ప్రమీల, కె.మహాలక్ష్మి, రమాతార, అనిత,ఎండి అన్వర్, భూతం ఐలయ్య, కొమురయ్య, బాపురాజు, డి.మధార్, రచ్చ శ్యామ్, కనకయ్య, బి నరేష్, తదితరులు పాల్గొన్నారు.